
సూర్య ఆదివారం
www.suryaa.com
18.2.2024

# బాల్యంపై గాజా నెత్తుటి మరకలు

## ఈ భీకరపోరు ఘటనల నుండి చిన్నారులు బయటపడేదెప్పుడో?



## చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**పి.వి.కి భారత రత్న ప్రకటించడంతోనే మరో తెలుగు వెలుగు నందమూరి తారక రామారావు అభిమానుల్లో చర్చ మొదలైంది. సినీ నటుడిగానూ.. రాజకీయ వేత్తగానూ ఎన్నో రికార్డులు సృష్టించిన ఎన్టీయార్ నిజంగానే భారత రత్న అవార్డుకు అన్ని విధాలుగానూ అర్హుడు. అయితే ఆయనకు ఇంత వరకు భారత రత్న రాకపోవడం దారుణమే.నన్నది తెలుగు ప్రజలలో భావన నెలకొంది. దీనిపై మీరేమంటారు.**

**– అలఘురి వసంత పద్మావతి, శ్రీకాకుళం**

మీరన్నది నిజమే పద్మగారూ చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ తర్వాత విభజిత ఏపీకి సిఎంగా ఉన్నప్పుడు కూడా కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో అధికారాన్ని పంచుకున్నారు. ఆ సమయంలో కూడా ఎన్టీయార్ కు భారత రత్న అవార్డు ఎందుకు తెప్పించుకోలేకపోయారన్నది కోటి డాలర్ల ప్రశ్న. నేటికీ ఉంది. వాజ్ పేయ్ హయాంలో ఎన్టీయార్ కు భారత రత్న అవార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం అనుకున్నా.. ఆ విషయం తెలియడంతోనే చంద్రబాబు నాయుడే ఆ అవార్డు ఇవ్వద్దని చెప్పారని హస్తిన వర్గాల్లో అప్పట్లోనే ఒక ప్రచారం ఉండేది. ప్రధానంగా ఎన్టీఆర్ ద్వితీయ సతీమణి లక్ష్మీ పార్వతి ఆ అవార్డును అందుకుంటారనే కారణంతో చంద్రబాబు నాయుడే వద్దని చెప్పారని దీంతో వాజ్ పేయ్ ప్రభుత్వం ఎక్కువ చర్చ పెట్టకుండా ఎన్టీయార్ పేరును వెనక్కి తీసుకుందని అంటారు. అయితే ఎన్టీయార్ అవార్డును చంద్రబాబే ఎందుకు వద్దంటారు? అని టిడిపి నేతలు నిలదీస్తారు. అయితే దానికి ఒక లాజిక్ ఉందంటున్నారు మరో వర్గం నేతలు. ఎన్టీయార్ 1996లోనే స్వర్గస్తులయ్యారు. ఆయన మరణానంతరం ఆయనకు భారత రత్న అవార్డు ప్రకటిస్తే..దాన్ని ఎవరు అందుకోవాలి? ఎన్టీయార్ నుండి టిడిపిని సొంతం చేసుకున్న చంద్రబాబు నాయుడికి కానీ..ఎన్టీయార్ సంతానానికి కానీ అవార్డు అందుకునే అవకాశం లేదు. ఎందుకంటే అవార్డును దివంగత నేత సతీమణికే అందించాల్సి ఉంది. అపుడు లక్ష్మీ పార్వతి దేశ వ్యాప్తంగా వార్తల్లోకెక్కుతారు. ఈ కారణంగానే చంద్రబాబు నాయుడు కానీ ఏపీ బిజెపి చీఫ్ గా ఉన్న ఎన్టీయార్ తనయ పురంధేశ్వరి కానీ ఎన్టీయార్ కు భారత రత్న అవార్డు కోసం గట్టిగా ప్రయత్నించలేదని అంటారు. కేవలం ఆయన జయంతి రోజున వర్ధంతి రోజున మాత్రమే ఎన్టీయార్ కు భారత రత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఎన్టీయార్ కు కూడా పి.వి.తో పాటు అవార్డు ఇచ్చి ఉంటే ఏపీలోనూ బిజెపికి కొంచెం ఇమేజ్ పెరిగేదని పరిశీలకులు అంటున్నారు.

**ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ ఇచ్చిన నివేదికను తెలంగాణ ప్రభుత్వం ప్రెవేశ పెట్టారు . కాగ్ ఇచ్చిన ఈ నివేదికలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతున్నాయి. ఈ విషయమై మీరేమంటారు? సర్.**


**పట్నాన రాజశేఖర్, హైదరాబాద్**

మీరన్నది నిజమే రాజా గారూ.... పంచాయతీ రాజ్ శాఖపై కాగ్ ఇచ్చిన నివేదికలో కీలక విషయాలు బయటపడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రాంట్ల మళ్లింపు జరిగిందని పేర్కొంది. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలిపింది. బకాయిలు వసూలు చేయడంలో గత ప్రభుత్వం విఫలం అయిందని పేర్కొంది. కొన్ని పనులకు అధిక బిల్లులు చెల్లించారని.. సకాలంలో రికార్డులు సమర్పించలేదని మొట్టికాయలు వేసింది. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత కరువైందని కాగ్ నివేదిక పేర్కొంది. గత ప్రభుత్వం విద్య, వైద్యం మీద ఖర్చుల విషయంలో వెనుకంజలో ఉందని తెలిపింది. మొత్తం వ్యయంలో..విద్య మీద 8 శాతం ఖర్చు చేయగా, వైద్యం కోసం 4 శాతం మాత్రమే ఖర్చు చేశారని తెలిపింది. గడిచిన మూడు సంవత్సరాలుగా రెవెన్యూ రాబడిని సాధించడంలో విఫలం అయిందని వెల్లడించింది. ద్రవ్య లోటు 46,638 కోట్లు, అప్పుల నిష్పత్తి పోలిస్తే 37.77 శాతం అని.. FRMB పరిమితి తో తెలంగాణ రాష్ట్ర అప్పుల నిష్పత్తి 12.77 శాతం ఎక్కువగా ఉందని తెలిపింది. 15వ ఆర్థిక సంఘంతో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర నిష్పత్తి 8. 47% ఎక్కువ అని తేల్చి చెప్పింది. మొత్తం రాష్ట్రం సొంత పనుల నుంచి షాపులు రిజిస్ట్రేషన్లు వస్తుసేవల పన్ను అమ్మకాలు ఇవన్నీ 91,270 కోట్లు రాష్ట్రానికి రాబడి అని.. 2021-22 లో వ్యవహారిక వ్యయం 1,36,804 కోట్ల రూపాయలుగా పేర్కొంది. వ్యవహారిక విషయంలో జీతాలు, పెన్షన్ల మీద ఖర్చు తగ్గిందని తెలిపింది. గత ప్రభుత్వం రెవెన్యూ రాబడి ఎక్కువ చూపించి.. లోటును తక్కువగా చూపించిందని కాగ్ నివేదిక పేర్కొంది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తులు, అప్పుల పంపకంపై పురోగతి జరగలేదని తేల్చి చెప్పింది. విభజన ఆస్తుల పంపకాలపై తగినంత దృష్టి పెట్టలేదని తెలిపింది. రూ. 1.18లక్షల కోట్ల రుణాలను బడ్జెట్‌లో పేర్కొనలేదని వెల్లడించింది. అప్పుల ద్వారానే రెవెన్యూ లోటును భర్తీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రుణాలపై 2032-33 నాటికి రూ. 2.52లక్షల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తుందని తెలిపింది

## లెజెండ్

### భారత సాయుధ తిరుగుబాటు

# పితామహుడు ఫడ్కే



వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే... దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధుడు. శక్తివంత మైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునః స్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరు నగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం.

వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 – 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్ధోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్ఢోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణే నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్లు, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహించాడు. వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చుకొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగు బాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు.

కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్ కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగు బాటు జరుగుతున్నది. వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లాలతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు.

బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరా బాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళ్తున్న ప్పుడు కలడ్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు. ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువ బడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాద కరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు. అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు.

ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు. కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించాల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం


### ప్రేమంటే



ప్రేమంటే...
మనిషికి దేవుడిచ్చిన
బహుమానం
మనిషిని మనిషిని బంధించే
మంత్రం
కలిమిలో లేమిలో కలిసి ఉండే
భాగ్యం
ఎదుటి వ్యక్తిని సంస్కరించే
ఆదర్శం
నవమాసాలు మోసి కన్నబిడ్డపై
తల్లి ప్రేమ
బిడ్డ పోషణకొరకు పగలుపగలు
రాత్రి కష్టపడే తండ్రి ప్రేమ
కష్టంలో నష్టంలో నేను ఉ
న్నాననే స్నేహితుని ప్రేమ
ఒకే కొమ్మకు పూచిన పూలలాగ
సోహోదర ప్రేమ
కుటుంబమనే కుటీరంలో
వెదజల్లబడిన ప్రేమ
ఎన్నో ప్రేమకథలు
రోజు క్రొత్తగా పుడుతూనే ఉ
ంటాయి
ఆరంభం ఎక్కడో
అంతం ఎక్కడో
కొన్ని ప్రేమలు తాత్కాలికం
కొన్ని ప్రేమలు స్వార్థపూరితం
కొన్ని ప్రేమలు అజరామరం
కొన్ని ప్రేమలకు కాలంతో లేదు
సంబంధం
నీవు చంద్రునివి
నేను వెన్నెల
నీవు ఒంటరి బాటసారి
నేను నీ మజిలీ
నీవు మేఘం
నేను మెరుపు
నీవు సరోవరం
నేను తామర పుష్పం
నీవు విరబూసిన వనం
నేను పురివిప్పిన మయూరం
నీవు నరుడు
నేను నారి
నీవు ఒక సగం
నేను ఒక సగం
జగానికి నిండుదనం
ప్రేమ ఒక్కరోజుకు కాదు
పరిమితం
మనసు ఉంటే రోజు
జరుపుకుందాం
ప్రేమ పండుగ

**అరుణ డేనియల్**
**9000606889**

## లేఖలు


సూర్య ఆదివారం
11.2.2024
సింధు నదిలో పసిడి పంట
పట్టుకు పోతున్న పాకిస్తానీయులు

**ముఖచిత్ర కథనం బాగుంది**

సింధూనదిలో బంగారు పంటలంటూ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కథనం ఆద్యంతం ఔరా అనిపించేలా ఉంది. భారత దేశంలోని ఓ నదీ ప్రవాహంలో జరుగుతున్న ఈ తతంగంపై భారత ప్రభుత్వానికి తెలిసినా ఎందుకు మిన్నకుండిపోతున్నది లక్షల పదాలున్న యక్షప్రశ్న అనే చెప్పక తప్పదు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటే భారతావనికి కాలా ఉప యుక్త ఆదాయం లభించే ఆస్కారం ఉంది కదా? మరి పాలకులు ఎందుకు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారో అర్థం కాదు.అనేక అంశాలపై సవివ రింగా వివరించిన రచయిత వివి గారి కి ధన్యవాదాలు , ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఞతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణులు పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## నేనూ... నా సైకిల్



నేనూ... నా సైకిల్
జ్ఞాపకాల దొంతర తిరగేస్తుంటే
'ట్రింగ్ ట్రింగ్' మంటూ ఒక
బెల్లు మ్రోగిన శబ్దం
అవును...
అది మా నాన్న సైకిలు...
మెత్తని సీటుండేది చక్రాల్లో
ప్లాస్టిక్పూల దండుండేది
చక్రాన్నంటుక తిరిగే
డైనోమోటుండేది
అదే చీకట్లో వెలుగిచ్చేది...
ట్రింగ్ ట్రింగ్... ట్రింగ్
ట్రింగ్... ట్రింగ్ ట్రింగ్...
బెల్లుండేది
నా వేళ్లకు పని చెప్పేది
నాకైతే తెగ నచ్చేసేది...


ఒక చేత్తో హ్యాండిల్
మరో చేత్తో క్యారేజి...
నాన్నే నా కాళ్లకి పైడిలుపై
మరోటింకో పైడిలుపై...
బొంగుకింద గ్యాపునుండి...
నేనే నడిపా?ఊ..ఊ..నాన్నే!
నాకైతే క్రెంచ్చొచ్చింది నాన్న
ముఖంలో వెలుగొచ్చింది...


అమ్మ కుట్టుమిషీను దారమైనా
నాన్న పెన్నుకింకైనా
బామ్మపీట్నే నశ్యమైనా తాతయ్య
చుట్టతంబాకైనా
ఇలా వెళ్ళా అలా తెచ్చా... ట్రింగ్
ట్రింగ్ మంటూ మురిసా


కొంచెం పొడవెదిగా...క్రెంచు
నుండి బొంగుకి చేరా...
ఊరంతా తిరిగా...
ఇంకొంచెం ఎత్తెదిగా...మెత్తని
సీటుకి చేరా...
చుట్టూ ఉర్లను చూశా...
దొస్తులను కలిసొచ్చేశా...

మూతిపై కొంచెం మీసమొచ్చింది
నాన్న సైకిల్ నాకొచ్చింది...
అక్క సంగీతంక్లాసు తమ్ముని
టివిషన్లాసు
నేనున్నూ నా సైకిలున్నూ...
మీకూ వినిపిస్తోందా
ఆ ట్రింగ్ ట్రింగ్ బెల్లు..
అవును...
అదే మా నాన్న సైకిలు...

**– అశోక్ గుంటుక**
**9908144099**



సూర్య బుడత

**బాలల కథ**

# చిన్నారి చేతలు

డేవిడ్ ఆరో తరగతి చదువుతున్నాడు. డేవిడ్ నాన్న విల్సన్ ప్రైవేట్ కంపెనీలో గుమస్తా. క్రిస్మస్ పండుగ అంటే డేవిడ్ కి చాలా ఇష్టం. క్రిస్మస్ ట్రీ చక్కగా ఇంట్లో పెట్టుకొని , చక్కని లైటింగ్ తో అలంకరించుకోవాలని చాలా కోరిక. అయితే తండ్రి ఆర్థిక పరిస్థితి సహకరించని కారణంగా డేవిడ్ కు ఆ కోరిక గతసంవత్సరం వరకు నెరవేరలేదు. ఈ సంవత్సరం ఎలాగైనా తన కోరిక నెరవేర్చుకోవాలని ఏడాది పొడవునా తనకు మిఠాయిలు కొనుక్కోవడానికి తండ్రి, తల్లి ఇచ్చిన చిల్లర సొమ్మును జాగ్రత్తగా దాచుకున్నాడు. క్రిస్మస్ కు వారం ముందుగానే తాను దాచిన డబ్బులన్నీ లెక్క పెట్టుకున్నాడు. సుమారు ఒకవేయి రూపాయలు వరకు ఉన్నాయి. చాలా సంతోషంగా డేవిడ్ ఉన్నాడు. ఈ ఏడాది ఇంట్లో క్రిస్మస్ ట్రీ చక్కగా అలంకరించుకోవాలని అనుకున్నాడు.

తండ్రి విల్సన్ ఇంటికి రాగానే"నాన్న! మనం ఈ ఏడాది క్రిస్మస్ ట్రీ ఇంట్లో పెట్టుకొని అలంకరించుకుందాం"అని అన్నాడు."ఒరేయ్! అందుకు ఒక వెయ్యి రూపాయలు వరకు ఖర్చు అవుతుంది కదా! మీ కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి నా దగ్గర ఉన్న సొమ్ము సరిపోతుంది. మరలా క్రిస్మస్ ట్రీ కొనడము అలంకరించడం నావల్ల కాదు"అని తండ్రి విల్సన్ అన్నాడు."నాన్న! నేను ఈ సంవత్సరం పొడుగునా వెయ్యి రూపాయలు పొదుపు చేశాను. ఆసొమ్ముతో క్రిస్మస్ ట్రీ కొనుగోలు చేసి చక్కగా అలంకరిద్దాం"అని డేవిడ్ అన్నాడు. విల్సన్ సంతోషంతో"అలాగే డేవిడ్... రేపు షాప్ కి వెళ్లి కొందాంలే,, పద ఒక్కసారి చర్చికి వెళ్లి వద్దాం"అని అన్నాడు. తండ్రి కొడుకులిద్దరూ సాయంకాలం తర్వాత తమ గ్రామానికి చివర్న ఉన్న చర్చికి వెళ్లారు. చర్చి బయట నలుగురు ఐదుగురు బిచ్చగాళు కనబడ్డారు. విల్సన్ వారికి తన జేబులో నుంచి పది రూపాయలు కాగితం తీసి అందరికీ సర్దుకోమన్నారు. అందులో ఒక ముసలి దంపతులు చలికి బాగా వణుకి పోతూ కనబడ్డారు డేవిడ్ కి. చర్చి నుంచి తిరిగి వచ్చినప్పుడు కూడా డేవిడ్ ఆ ముసలి దంపతులను గమనించాడు. తండ్రి కొడుకులిద్దరూ ఇంటికి వచ్చేసారు.

తర్వాత రోజు సాయంకాలం తండ్రి వచ్చిన తర్వాత డేవిడ్ తో"ఒరేయ్! బజార్ కి వెళ్దాం పద. క్రిస్మస్ ట్రీ కొంటాను అన్నావు కదా! నీ దగ్గర ఉన్న వేయి రూపాయలు పట్టుకో"అని విల్సన్ అన్నాడు.

డేవిడ్ విల్సన్ ఇద్దరూ బజారుకు వెళ్లారు. బజారు లో మూడు షాపులు క్రిస్మస్ ట్రీ అలంకరణతో ఉన్న దాన్ని కొనడానికి విల్సన్ తిప్పాడు. కాని డేవిడ్"నాకు ఇవేమినచ్చుటం లేదు నాన్న " అని అనేశాడు. డేవిడ్ ఏదో ఆలోచిస్తున్నాడు.విల్సన్ డేవిడ్ ను చూసి"నువ్వు బజారుకు వచ్చావుగాని ఏదో ఆలోచిస్తున్నావు. క్రిస్మస్ ట్రీ ఎంపిక చేయలేకపోతున్నావ్ కారణమేమిటి?"అని అడిగాడు.


డేవిడ్"నాన్న! నాకు మొన్న రాత్రి మనం చర్చికి వెళ్లినప్పుడు బయట ఉన్న ముసలి దంపతులు గుర్తుకు వస్తున్నారు. వారు చలిలో వణికి పోతూ బిచ్చ




మెత్తుకుంటున్నారు.అందుకే వారికి చలి నుండి రక్షించే విధంగా వాళ్లకు ఈ సొమ్ముతో ఉన్ని దుస్తులు కొందామని అనుకుంటున్నాను"అని తండ్రితో అన్నాడు. విల్సన్"మంచి ఆలోచన డేవిడ్. క్రిస్మస్ ట్రీ కొంటే ఆ నాలుగు ఐదు రోజులు మాత్రమే నీలో ఆనందం ఉంటుంది. కానీ ఆ సొమ్ముతో నువ్వు ముసలి వాళ్లకు ఉన్ని దుస్తులు కొనిస్తే , వారికి చలికాలం నుంచి రక్షణ కలుగుతుంది. ప్రభువు కూడా సంతోషిస్తారు"అని తండ్రి ప్రోత్సహించారు. బజార్లో తన దగ్గర ఉన్న సొమ్ముతో చక్కని ఉన్ని దుస్తులు కొని ఉదయమే తండ్రి తో చర్చి దగ్గరకు వెళ్లి ముసలి దంపతులకు డేవిడ్ ఉన్ని దుస్తులు అందించాడు. ఆ ముసలి దంపతులు చాలా ఆనందించారు. డేవిడ్ ను ఆశీర్వదించారు. విల్సన్ అలాగే చర్చి ఫాదర్ డేవిడ్ మంచి మనసును అభినందించారు. భుజం తట్టారు. డేవిడ్ కి చెప్పలేని సంతోషం కలిగింది.ల

**– మొర్రి గోపి**
**8897882202**











## మంచిమాట

ప్రశాంతంగా జీవించాలనుకుంటే...
ఎదుటివారు మారాలని ఆశించకండి,
మార్చాలని ప్రయత్నించకండి-
మీరే మారండి. కాళ్ళకి ఏమీ
గుచ్చుకోకుండా ఉండాలంటే...
మనం చెప్పులు వేసుకుంటాంగానీ
వీధంతా తివాచీ పరచం కదా.

# దేవుడి భార్య

## సరికొత్త సీరియల్

**(గతవారం తరువాయి)**

ప్రభుత్వాలను నమ్మితే ఏ పనీ జరగదని 'హెూం ఫర్ దేవదాసి' పేరుతో ఒక సంస్థను నెలకొల్పింది. సంస్థలో కార్యకర్తలుగా అనేక మందిని చేర్చుకుంది. కార్యకర్తలు ప్రజల దగ్గరికి వెళ్లి దేవదాసీల గురించి, వారి సమస్యల గురించి వివరించి చందాలు వసూలు చేయాలి.

మొదట పది మంది కార్యకర్తలతో మొదలైన సంస్థ మూడు నెలలు తిరక్కుండానే 1000 మంది అయ్యారు. నెమ్మది నెమ్మదిగా సంస్థకు ప్రజల నుండి మద్దతు పెరిగింది. సంస్థకు వచ్చిన డబ్బును బ్యాంకులో వేసి వచ్చిన వడ్డీతో పనులు చేయడం ప్రారంభించింది.

అక్కడక్కడ ఇంకా తమ పిల్లలను దేవదాసీలుగా మార్చడం జరుగుతూనే ఉంది. అలాంటి వాళ్ల దగ్గరికి వెళ్ళడం, వారికి వివరంగా దేవదాసి విధానం తప్పని చెప్పడం, ఆ పిల్లలను తన సంస్థలో చేర్చుకొని, దేవదాసి హెూం లోనే చదువు చెప్పించడం చేసింది.

తన సంస్థలోకి అనేకమంది రచయితలు, మేధావులు, సంఘసంస్కర్తలు, అనేక రంగాల్లో ఆరితేరిన వారు సభ్యులుగా చేరారు. చదువు ఆపేసిన ఆడపిల్లలకు చదువు చెప్పడానికి అనేక మంది ముందుకు వచ్చారు. ఆ విధంగా దేవదాసీలుగా మారిన వారి పిల్లలు విద్యావంతులు అవ్వడం మొదలైంది.

చదువుకుంటే ఏ పని అయినా చేసుకొని సమాజంలో గౌరవంగా బతకచ్చని బలంగా నమ్మింది నడిపమ్మ. నడిపమ్మ చేసే కార్యక్రమాలు చూసి కొంతమంది పెద్ద మొత్తంలో డబ్బు, స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో నాలుగు గదుల బడి నెలకొల్పింది.

రెండు ఎకరాల భూమిలో దేవదాసి హెూంకి కావాల్సిన కూరగాయలు పండించింది. ఆ తర్వాత ఆర్గానిక్ కూరగాయలు పండించి అమ్మింది. సంస్థకు ఎవరో పశువులను ఉచితంగా ఇచ్చారు. మొదట పాలు, పెరుగు దేవదాసి హెూం వారే తినేవారు. ఆ తర్వాత మరో పది పశువులు కొని పాలను, పెరుగును, నెయ్యిని, వెన్నను అమ్మడం మొదలు పెట్టింది.

'గంగా' పాలు అనే పేరుతో పాలను అమ్మడం మొదలు పెట్టింది. జిల్లాలో ఆ పాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. పది పశువులు కాస్త యాభై అయ్యాయి. అలా అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంది.

ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకాన్ని నడిపమ్మ ఉపయోగించుకుంది. అధికారులతో, రాజకీయ నాయకులతో పోరాడి ప్రతి దేవదాసికి గుర్తింపు కార్డును మంజురూ అయ్యేలా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవదాసీలను గుర్తించి ఒక లిస్టు తయారు చేసింది. వారి సమస్యలను నమోదు చేసి ప్రభుత్వం ముందు ఉంచింది.

వృద్ధాప్యంలో ఉన్న దేవదాసీలకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. తన పిలుపుతో అనేక మంది స్పందించారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. కొంతమంది అధికారుల బృందం నడిపమ్మ తయారు చేసిన దేవదాసీల లిస్టును పరిశీలించి అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్ ఇచ్చింది.

నడిపమ్మ కూతురి పేరు మీనాక్షి. తనకు పెళ్లి చేయాలని ఆశించింది నడిపమ్మ. పెళ్లి సంబంధాలు చూసింది. పెళ్లి చేసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. పెళ్లి వయసులో ఉన్న దేవదాసీలకు పెళ్ళిళ్ళు చేస్తే వారి కంటూ ఒక కుటుంబం ఏర్పడుతుందని, వాళ్ల జీవితాలు వారు బతుకుతారనుకుంది.

మీనాక్షి చూడటానికి అందంగా ఉంటుంది కానీ దేవదాసి అయిన కారణంగా పెళ్లి చేసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. పెళ్లి చేసుకుంటాను కాని కట్నం ఎక్కువగా కావాలన్నాడు ఒక సన్యాసి, పెళ్లి చేసుకోను ఉంచుకుంటాను అన్నాడు మరో వెధవ, పెళ్లి చేసుకోవాలనే ఉంది కాని తను మా కులం కాదన్నాడు మరో గొర్రె. నేను అభ్యుదయవాదిని వికలాంగురాలిని, భర్త చనిపోయిన మహిళను పెళ్లి చేసుకుంటాను కాని దేవదాసిని చేసుకోలేను అన్నాడు మరొక పురుష పుంగవుడు.

వితంతు వివాహాల కోసం ఎలా అయితే పోరాటం జరిగిందో దేవదాసీల వివాహాల కోసం కూడా అలాంటి పోరాటమే జరగాలనుకుంది నడిపమ్మ. దేవదాసీల పిల్లలకు, పెళ్లి చేసుకోని దేవదాసీలకు పెళ్ళిళ్ళు చేయాలని నిర్ణయించుకుంది. దేవదాసి వివాహాలు పేరుతో వధూవరులను ఒక చోటుకు చేర్చింది. మీనాక్షితో పాటు మరో ఇద్దరికీ పెళ్లి నిశ్చయమయ్యింది.

అనేక సమస్యలు, అడ్డంకులు, ఎంతోమంది చంపుతామని భయపెట్టడం, బెదిరించడం జరుగుతూనే ఉంది. దేవదాసి వ్యవస్థ చట్టవ్యతిరేకమైనా ఇంకా చాలా గ్రామాల్లో సంస్కృతీ, సంప్రదాయం పేరుతో పెళ్లికాని ఆడపిల్లలను దేవదాసీలుగా మారుస్తున్నారు. అలాంటి వారితో పోరాటం చేయాలంటే సామాన్యమైన విషయం కాదు.

ప్రతి ఊరిలో తక్కువ కులం వారే దేవదాసీలుగా మారడాన్ని నడిపమ్మ ఎత్తి చూపింది. అగ్ర కులాల ఆడవాళ్ళు దేవదాసీలుగా ఎందుకు లేరని ప్రశ్నించింది? తక్కువ కులాల వారికే ఎందుకు ఇలాంటి సంప్రదాయాలని? దళిత, మైనారిటీ మహిళలనే లక్ష్యంగా చేసుకొని కొంతమంది అగ్ర కులాల



వారు చేసిన కుట్రలో భాగమేనని, ప్రజలు ఇలాంటి వాటిని నమ్మకూడదని సభలు, సమావేశాలు పెట్టి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నం చేసింది.

అగ్రకులాల వాళ్లు, డబ్బున్న వాళ్లు ఇప్పటికీ దేవదాసి వ్యవస్థను తమ భుజాల మీద మోస్తున్నారని అలాంటి వాళ్లకు తగిన శిక్షలు పడాలని పోరాడింది. అనంతపురం జిల్లా ఉంతకల్లు గ్రామంలో ఇలాంటి ఆచారం ఇంకా జరుగుతోందని తెలుసుకున్న నడిపమ్మ, సీతవ్వ ఆ గ్రామానికి వెళ్ళే ప్రయత్నం చేశారు. ఊరి సరిహద్దులోనే గ్రామ పెద్దైన వెంకటరెడ్డి మనుషులు ఊరిలోకి వస్తే చంపుతామని బెదిరించారు. ఏమీ చేయలేక నడిపమ్మ గుంపు వెనక్కు వెళ్లారు. వెంకట్ రెడ్డి అమ్మాయిలను దేవదాసీలుగా మార్చి, వాళ్లను శారీరకంగా అనుభవించిన తర్వాత ఇక్కడే ఉంటే మీ బతుకులు మారవని నమ్మబలికి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు అమ్ముతున్నాడని, వేశ్యలుగా మారుస్తున్నాడని, వేశ్యా వృత్తి వృత్తిలోకి దించి ఆ డబ్బును స్వాహా చేస్తున్నాడని తెలుసుకుంది.

వెంటనే పోలీస్ స్టేషన్ లో వెంకట రెడ్డి మీద కేసు పెట్టింది. కేసు నమోదు అయ్యింది కాని విచారణ జరగలేదు. ఎందుకంటే వెంకట రెడ్డికి ఒక పెద్ద రాజకీయ నాయకుడి అండ ఉంది. వాడి సహకారంతోనే వెంకట రెడ్డి చెలరేగిపో తున్నాడు. ఇప్పటివరకు దాదాపు రెండు వేల మంది ఆడ పిల్లలను అనేక రాష్ట్రాలకు, కొన్ని దేశాలకు అమ్మాడని తెలుసుకుంది. కేవలం ఉంతకల్లు గ్రామం నుండే కాకుండా కదిరి, రాయచోటి, రాయదుర్గం, కళ్యాణ దుర్గం, అనంతపురం, కడప, చిత్తూరు, ఇంకా రాష్టంలో అనేక ప్రాంతాల నుండి ఈ నీచ దందా జరుగుతోందని తెలిసి నివ్వెరపోయింది.

సమాజం ఎంత ముందుకు సాగినా మహిళలకు అనేక రకాలుగా సమస్యలు ఉండనే ఉన్నాయని తెలుసుకుంది. బాల్య వివాహాలు, కన్యాశుల్కం, సతీసహగమనం, దేవదాసి విధానం, మహిళలను వేశ్యలుగా మార్చడం, శృంగార వస్తువులుగా చేయడం కాలానికి అనుగుణంగా జరుగుతూనే ఉన్నాయని మదనపడింది.

మహిళలు వాళ్ల కాళ్ల మీద నిలబడాలని, ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని, ఉన్నత చదువులు చదువుకొని సమాజం గురించి అవగాహన పెంచుకోవాలని అనుకుంది. మహిళలు మూఢనమ్మకాలను, మూఢవిశ్వాసాలను, సంస్కృతిని, సంప్రదాయాన్ని గుడ్డిగా నమ్మినంత కాలం ఏదో ఒక సమస్య పీడిస్తూనే ఉంటుందని బలంగా నమ్మింది. అదే విషయాన్ని అనేక సభల్లో, సమావేశాల్లో చెప్పింది.

***

'ఏం రా వెంకట రెడ్డి? ఎవరది? ఏమంట దాని గోడు?'

'అదొక జోగిని ముండ, చాలా ఏళ్లు జైలులో ఉండి వచ్చింది. దాని వెనుక చాలా మంది ఉన్నారు. ఏందో హెూం కూడా నడుపుతోంది. మన ఊళ్లో దేవదాసీలు ఉన్నారని తెలిసి వచ్చింది. మన గురించి మొత్తం తెలుసుకొని పోలీసు కేసు పెట్టింది. పోలీసు కుక్కలకు మనం లక్షల్లో డబ్బు ఇస్తున్నామని దానికి తెలియదు పాపం. మీరేం కంగారు పడకండి నేను చూసుకుంటా.'

'నా పేరు బయటకు రాకూడదు, వస్తే నువ్వు ఉండవు. అవసరమైతే దాన్ని చంపేయ్.'

'ఆడముండ, అందులోను దేవదాసీది. అదేం చేస్తుంది సార్. మీరు టెన్షన్ పడకండి నేను చూసుకుంటానని మంత్రితో ఫోన్ మాట్లాడి పెట్టేశాడు వెంకటరెడ్డి.'

నడిపమ్మను తక్కువ అంచనా వేశాడు. ఆడది ఏం చెయ్యదని భ్రమపడ్డాడు. కొడితేనో, తిడితేనో, తరిమితేనో పారిపోతుంది, భయపడుతుంది, బెదురుతుంది, జంకుతుందనుకున్నాడు.

నడిపమ్మ ఒక అడుగు వెనక్కి వేసింది బలాన్ని పెంచుకోడానికి, వెంకటరెడ్డి మూలాలను తెలుసుకోడానికి, న్యాయపరంగా ముందుకు సాగడానికి.

రెండు వందల మందిని వెంటబెట్టుకొని మళ్ళీ ఉంతకల్లు గ్రామానికి చేరుకుంది. తన వెంట పోలీసులు ఉన్నారు. అందరూ డబ్బులు తినే పోలీసులే ఉంటారనుకోవడం వెంకటరెడ్డి మూర త్వం, కొవ్వు. వెంకట రెడ్డి మనుషులు అడ్డుపడ్డారు, ఊళ్లోకి రాడానికి వీల్లేదని అరిచారు, తోశారు, కొట్టడానికి ముందుకు వచ్చారు. తోపులాట, దొబ్బులాట.

'ఎందుకు రాకూడదు? ఇది స్వతంత్ర భారతదేశంలో భాగం కాదా? ఈ ఊళ్లో అమాయక ఆడపిల్లలను దేవదాసీలుగా మారుస్తున్నారు. వేశ్యలుగా మార్చి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు అమ్ముతున్నారనే సమాచారం ఉంది.'

'ఊళ్లో ఉన్న దేవదాసీలతో మాట్లాడాలి, పోలీసుల అనుమతి కూడా ఉందని గట్టిగా సమాధానం చెప్పింది. పులిలా పంజా విసిరింది, వెంకటరెడ్డి మనుషులను తోసుకుంటూ, దొబ్బుకుంటూ ఊళ్లోకి అడుగు పెట్టింది.'

వెంకట రెడ్డి మనుషులను పోలీసులు అడ్డుకున్నారు. ఊళ్లో ఉన్న ప్రజలతో, దేవదాసీలతో నడిపమ్మ గుంపు మాట్లాడింది, విషయాన్ని తెలుసుకుంది. ప్రస్తుతం ఊళ్లో వంద మందికి పైగా దేవదాసీలు ఉన్నట్లు గుర్తించారు. త్వరలో వాళ్లను కూడా అమ్ముతున్నట్లు తెలుసుకున్నారు. తగిన సాక్ష్యాలను సేకరించి పోలీసులకు అప్పగించారు. ఇప్పటి వరకు ఎంతో మంది ఆడపిల్లలను అమ్మినారని, వారి వివరాలు కనుక్కొని విడిపించాలని, సొంత ఊళ్లకు పంపాలని డిమాండ్ చేశారు.

ఊళ్లో జరిగిన తతంగం గురించి మంత్రికి తెలిసి వెంకట రెడ్డి మీద ఇంతెత్తు లేచినాడు. నడిపమ్మ గురించి పూర్తిగా తెలుసుకున్నాడు మంత్రి. నడిపమ్మ తలుచుకుంటే ఏమైనా చేస్తుందని నడిపమ్మను చంపడమే ఉత్తమమని వెంకటరెడ్డికి సలహా ఇచ్చినాడు.

'సార్ నడిపమ్మను చంపడం అంత తేలిక కాదు. దాని వెంట ఎప్పుడూ పది మంది ఉంటారు. గుంపులు గుంపులుగా మనుషులను వేసుకొని తిరుగుతుంటుంది. పైగా దాన్ని చంపితే పెద్ద దుమారం అయ్యే ప్రమాదం ఉంది.'

'ఏందిరా? అదేదో ముఖ్యమంత్రి అయినట్టు చెప్తున్నావు. పెద్ద పెద్ద వాళ్లనే చంపి నామరూపాలు లేకుండా చేసినోన్ని ఒక ఆడదాన్ని చంపడం నాకు కుదరదు అనుకుంటున్నావా? నీ వల్ల కాకపోతే చెప్పు నేను మనుషులను పంపుతా పడుకున్నప్పుడే దాన్ని పైకి పంపుతారు. అది గాని ధర్నాలు, సభలు అంటూ రోడ్డుకు ఎక్కిందంటే మన దందా అందరికీ తెలిసిపోయే ప్రమాదం ఉంది. సమస్య చిన్నగా ఉన్నప్పుడే తెంపాలి.'

'సరే అయ్యా! మీరు చెప్పినట్టే నడిపమ్మను కాటికి పంపే ఏర్పాటు చేస్తాను.'

మూడు రోజుల తర్వాత 'హెూం ఫర్ దేవదాసి' మీద అర్ధరాత్రి దుండగుల దాడి జరిగింది. నడిపమ్మతో పాటు రామక్క, లచ్చుమ్మను కూడా చంపేశారు. హెూంలో ఉన్న నగదు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకెళ్ళిపోయారు.

నిద్రపోతున్న నడిపమ్మ మీద కత్తులతో దాడి చేశారు. నడిపమ్మ ఏమాత్రం భయపడకుండా వారిని ఎదిరించింది, తప్పించుకోడానికి ప్రయత్నం చేయలేదు, వాళ్లను ఎదుర్కోడానికే శతవిధాల ప్రయత్నం చేసింది.

పది మంది చుట్టుముట్టి కత్తులతో, పిడి బాకులతో, గొడ్డళ్ళతో దాడి చేశారు. నడిపమ్మ నిరాయుధురాలు అయినా కూడా ఒకన్ని ఎగిచ్చి తన్నింది, ఇంకొకడిని గోడకేసి బాదింది. నడిపమ్మ పొట్టలోకి కత్తిని గుచ్చాడొకడు, గుండెలపై గొడ్డలితో నరికాడు మరొకడు, కన్నుల్లో కత్తులతో పొడిచారు, తొడలను చీల్చారు, సగం గొంతు రంపంతో కోశారు. పాలిండ్లను కోసి విసిరేశారు, మర్మాంగంపై సూదులతో గుచ్చారు, చెప్పడానికి వీలు లేని విధంగా నడిపమ్మ హత్య జరిగింది.

నడిపమ్మను చంపాలంటే కత్తితో పొడిస్తే సరిపోతుంది కానీ అలా చేయలేదు. నడిపమ్మ హత్యతో ఉంతకల్లుకు ఎవరూ రాకూడదు, ఉంతకల్లు పేరు తలుచుకుంటే నడిపమ్మ హత్య గుర్తు రావాలని అలా చంపారు.

అది మంత్రి చేయించిన ఉన్మాదపు హత్య, ఉగ్రవాద హత్య, మగ అహంకార హత్య, డబ్బు హత్య, విలువలు కోల్పోయిన మానవత్వం లేని సమాజ హత్య. ఇలాంటి హత్యలు చేసే వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవడం ప్రజలు చేస్తున్న పొరపాటు, తప్పు, అవసరం, నోటుకు ఓటును అమ్ముకోవడం. మంత్రి ప్రత్యక్ష హత్య చేస్తే ప్రజలు నడిపమ్మను పరోక్షంగా హత్య చేశారు.

నడిపమ్మ, రామక్క, లచ్చుమ్మ హత్యల గురించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారమే లేసింది. పత్రికల్లో పతాక శీర్షికల్లో నడిపమ్మ హత్య గురించి వార్తలు వచ్చాయి. నడిపమ్మ హత్య వెనుక ప్రభుత్వం ఉంది, ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నది, స్వయంగా మంత్రే దగ్గరుండి హత్య చేయించారనే వార్తలు గుప్పుమన్నాయి.

ఆరు నెలలు గడవక ముందే నడిపమ్మ హత్యకు కారకులైన దుండగులను పట్టుకున్నారు.

హెూంలో ఉన్న డబ్బును మాత్రమే దొంగలించాలని చూశామని కాకపోతే నడిపమ్మ, రామక్క, లచ్చుమ్మ అడ్డు రావడంతో వాళ్లను చంపాల్సి వచ్చిందని హంతకులు చెప్పారని పోలీసులు తెలియజేశారు.

వెంకటరెడ్డికి కాని, ప్రభుత్వానికి కాని ఈ హత్యతో ఎలాంటి సంబంధం లేదని నిస్సిగ్గుగా తేల్చారు.

'హెూం ఫర్ దేవదాసి' సంస్థ కొత్త అధ్యక్షురాలిగా మీనాక్షిని ఎంపిక చేసుకున్నారు సంస్థ సభ్యులు.

సీతవ్వ, అనసూయ అధ్వర్యంలో మీనాక్షి హెూం పనులను చూసుకోవడం మొదలు పెట్టింది. నడిపమ్మ హత్యపై తమకు తగిన న్యాయం జరగలేదని సుప్రీమ్ కోర్టులో కేసు వేశారు.

**(మిగతా వచ్చేవారం)**



రచన : జానీ తక్కెడసిలా
7259511956

# అవగాహనతో పెళ్ళి... అపార్థంతో విడాకులు




భారతదేశ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందా? అమాయకమైన చిన్న పిల్లలు తల్లిదండ్రుల స్పర్ధల మధ్య నలిగిపోతున్నారా ?అంటే కొంతవరకు అవునని అనాల్సి వస్తుంది. సెలబ్రిటీలు మొదలుకొని సామాన్యుల వరకు భార్యా భర్తలు విడిపోవడం ఎక్కువైందనే చెప్పాల్సి వస్తుంది. పెళ్లి పెటాకులు అయింది అనే మాట ఎప్పుడో కానీ వినిపించేది కాదు .ప్రస్తుతం మీడియా ద్వారా ప్రతి చిన్న విషయం ప్రజలకు తెలుస్తుంది ముఖ్యంగా హీరో హీరోయిన్ల మీద విపరీతంగా అభిమానం పెంచేసుకుంటున్నారు అభిమానులు .ఈమధ్య జ్యోతిక సూర్య విడిపోయారని జ్యోతిక పిల్లల్ని తీసుకుని ముంబైకి మకాం మార్చేసిందని మీడియాలో వచ్చే వార్తలు చూసి అభిమానులు బాధపడుతున్నారు. కానీ అలాంటిదేమీ లేదని తనకు అక్కడ అవకాశాలు రావడం వల్ల వెళ్లాను అంతే అని జ్యోతిక క్లారిటీ ఇచ్చింది .అలాగే ఐశ్వర్య ,అభిషేక్ బచ్చన్ లు విడాకులు తీసుకుంటున్నారని అజిత్ శాలిని, విజయ్ వంటి వారందరూ విడాకులు తీసుకోబో తున్నారని మీడియాలో వస్తున్న వార్తలను చూసి అభిమానులు అందులో ఎంతో కొంత నిజం ఉండవచ్చు సమంత నాగచైతన్య విషయంలో అలాగే ఐశ్వర్య ధనుష్వంటి వారు విడిపోవడం వల్ల అలాంటి వార్తలు విన్నప్పుడు నిప్పు లేనిదే పొగ రాదు కదా అని అవి నిజమేనేమో అని అభిమానులు బాధపడుతున్నారు రోజురోజుకు విడాకులు తీసుకునే వారి సంఖ్య పెరిగిపోతుంది ఇందుకు ఎవరు బాధ్యులు అంటే ? మనమే కారణం అని చెప్పక తప్పదు పూర్వం ఒకసారి పెళ్లి అయ్యిందంటే భర్త కుంటి వాడైనా , గుడ్డి వాడైనా , కోపిష్టి వాడైనా, భార్యలు సర్దుకు పోయేవారు.కాబోయే భర్త ఎలాంటి వాడో తెలుసుకునే,చూసే అవకాశం వారికి ఉండేదికాదు.ఆర్థిక స్వాతంత్ర్యం ఉండేది కాదు. తల్లిదండ్రుల కష్టం చూసి, తర్వాత తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని. సర్దుకు పోయేవారు. ఒక తరం స్త్రీలు పడిన కష్టాన్ని చూసిన వారు, తమ పిల్లలు బాగా చదువుకోవాలి ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండాలని కోరుకున్నారు. అమ్మా యిలను అబ్బాయిలను కూడా సమానత్వం పాటిస్తూనే పెంచుతున్నారు. నువ్వూ ఇంటి పనులు చేయాలి, స్త్రీలను గౌరవించాలి అని మగ పిల్లలకు నేర్పుతూనే ఉ న్నారు.నేటి తరం పిల్లలకు మంచి విద్య, ఉద్యోగాలు ఉంటున్నాయి. ఆర్థికంగా ఒకరి పై ఆధార పడే పరిస్థితి లేదు. చాలా మందికి కాబోయే భాగ స్వామిని చూసి ,మాట్లాడి నచ్చితేనే పెళ్లి చేసుకునే స్వాతంత్ర్యం ఇస్తు న్నారు. అయినా విడాకులు తీసుకునే వారి సంఖ్య పెరిగిపోతూనే ఉం ది.పెళ్లికి ముందే అసలు పెళ్లి అంటే ఏంటి? ఎందుకు చేసుకుంటు న్నాము,? ఎలాంటి పరిస్థితులు ఎదురు కావచ్చు వంటివి ఆలోచించి పెళ్లి చేసుకుని . చిన్న చిన్న సమస్యలు ఉంటే సర్దుకు పోయి కుటుంబ వ్యవస్థను తమ సంతోషాన్నీ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది..

---

# శ్రీపాద శ్రీవలభుని విశిష్టతలేంటి..



పురాణాల ప్రకారం, దత్తాత్రేయ స్వామిని త్రిమూర్తుల స్వరూపంగా భావిస్తారు. మూడు తలలు, ఆరు చేతులతో కనిపించే ఈ స్వామి చుట్టూ నిత్యం శునకాలు, గోమాతలు సంచారం చేస్తుంటాయి. పతివ్రత అనసూయ, అత్రి మహర్షి దంపతులకు ఈ యుగ పురుషుడు జన్మించాడు. ఒక మునిగా జన్మించినప్పటికీ, తను పెరిగిన కాలంలో భగవంతుడిగా మారిపోయాడు. శాంతి స్వరూపంతో కనిపించే ఈయనను చూస్తే దయ్యాలు, భూతాలు ఎంతో భయపడిపోతాయని పురాణాల్లో పేర్కొనబడింది. దత్తాత్రేయుని తొలి అవతారం శ్రీపాద శ్రీ వల్లభ అవతారం, రెండో అవతారం శ్రీ నరసింహ సరస్వతి. శ్రీపాద శ్రీ వల్లభ జన్మస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పీఠాపురం. అప్పలరాజు శర్మ, సుమతి దంపతులకు ఈయన జన్మించారు. పెద్దయ్యాక సుమారు 35 సంవత్సరాలు కురవపూర్‌లో జ్ఞానం కోసం, వైరాగ్య సిద్ధి కోసం తపస్సు చేశాడు. కృష్ణా నదిలో అశ్వీయుజ బహుళ ద్వాదశి నాడు తన తుది శ్వాస విడిచిపెట్టాడు.

**స్కంద పురాణంలో దత్తాత్రేయ ప్రస్తావన..**

గురు ద్వాదశి వేళ దత్తాత్రేయుడు తనపై నమ్మకం ఉంచిన భక్తులకు పరోక్ష దర్శనం భాగ్యం కల్పిస్తాడని చాలా మంది నమ్ముతారు. హిమాలయాల నుంచి 28 వేల మంది యోగులు, సిద్ధులు ఈ ప్రదేశాన్ని సందర్శించి దత్తాత్రేయుని దర్శనం చేసుకున్నారని స్కంద పురాణంలో వివరించబడింది. నిజాం పాలనలో ఈ ప్రాంతానికి కురువలయ అని పేరు పెట్టారు.

**వెయ్యేళ్ల వట వృక్షం..**


శ్రీపాద శ్రీవల్లభపాదుకా ఆలయంలో వెయ్యేళ్ల వట వృక్షం, టెంబే స్వామి మహారాజు తపస్సు చేసిన గుహ, ఔదుంబర వృక్షం, నదికి అవతలి వైపున ఉన్న శ్రీపాద ముద్రలు, దత్త మందిరం, శ్రీ విఠల బాబా ఆశ్రమం ఉన్నాయి.

**ఎలా చేరుకోవాలంటే..**

ఈ ఆలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్ర సరిహద్దులో ఉంది. రాయచూర్ నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ నుంచి మహబూబ్ నగర్ మీదుగా రాయచూర్‌కు సుమారు ఐదు గంటలు పడుతుంది. రాయచూర్ నుంచి ఆత్కూరు వరకు మరో బస్సులో ప్రయాణం చేయాలి.

**20 నిమిషాల పడవ ప్రయాణం..**

ఆత్కూరు నుంచి కురుపురానికి క్రిష్ణా నదిలో 20 నిమిషాల పాటు చిన్న పడవలు లేదా పుట్టీల్లో ప్రయాణించాలి. నదీ ప్పీరయాణం తర్వాత ఆలయానికి చేరుకున్న వారికి స్వామి దర్శన భాగ్యం కలుగుతుంది. ఈ ఆలయాన్ని సందర్శించిన వారి కోరికలన్నీ నెరవేరుతాయని, దోషాలన్నీ తొలగిపోతాయని చాలా మంది నమ్ముతారు.



పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.



# బాల్యంపై గాజా నెత్తుటి మరకలు

## ఈ భీకరపోరు ఘటనల నుండి చిన్నారులు బయటపడేదెప్పుడో?

**డబ్బున్నవాడు ఎప్పుడూ నిరుపేదలపైనే దాడులకు ఉసిగొల్పుతాడు. బలవంతుడు బలహీనుడుపైనే తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. అదే నిరుపేద కి కడుపు మండి తిరగబడితే తట్టుకునే శక్తి ఆ ధనవంతుడికి ఉండదు. పేదవాడు ఎక్కడ తిరగబడతాడో అన్న మానసిక భయంతోనే తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకే ఈ దాడులు. ఇజ్రాయెల్ గాజాపై దాడులు చేయడాన్ని కూడా ఒక కోణంలో చూస్తే అదే అర్థమవుతుంది. ఇజ్రాయెల్ సైనిక దాడుల్లో లిగాజా నగరం గజగజలాడింది. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని నిస్సహాయ పరిస్థితుల్లో గాజా ప్రజలు వణికిపోయారు. చర్చలతో సాధించుకోవాల్సిన ఇరు దేశాల సత్సంబంధాలు రాకెట్ దాడుల వరకూ వస్తే అక్కడి ప్రజల స్థితిగతులు ఏంటన్నది ఎవరు ఆలోచిస్తారు..? గాజాలో అనాథలుగా వేలాది మంది చిన్నారులు శరీరంపై గాయాలతో, ఆకలి మంటలతో... ఒంటరితనంతో ఎంత కష్టంగా బతుకుతున్నారంటే.. దీనికి కారకులు ఎవరు..? ఏదైనా దేశంలో శత్రువులను మట్టుబెడితే మానవ హక్కులు మంటగలిసి పోతున్నాయంటూ నెత్తీనోరూ బాదుకునే హక్కుల నేతలు గాజా దాడుల్లో బాలల శరీరంపై కనిపించే గాయాలు కాదు.. పసి హృదయాలు మరచిపోని తీవ్ర ఘటనలపై ఇప్పుడు గొంతెత్తాల్సిన అవసరం ఎంతో ఉంది.**

గాజాలో ఇజ్రాయెల్ దాడులతో వందలాది కుటుంబాలు తుడిచిపెట్టుకుపోయాయి. 23 లక్షల గాజా జనాభాలో యాభై శాతం మంది చిన్నారులుంటారు. ఈ భీకర యుద్ధంతో వారి జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి. పౌరులకు హాని కలిగించకుండా హమాస్‌ను తుడిచిపెట్టడమే లక్ష్యంగా తాము ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ఒక పక్క చెబుతున్నప్పటికీ.. పాలస్తీనా వైద్య అధికారులు వెల్లడించిన లెక్కల ప్రకారం 11,500 మందికి పైగా 18 ఏళ్లలోపు బాలబాలికలు మత్యుఒడికి చేరుకున్నారు. భారీ సంఖ్యలోని ప్రజలు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎంతోమంది జీవితాలు తలకిందులయ్యాయి. ఇటువంటి యద్దాలు సంభవించినప్పుడు బాధితులకు సంబంధించి కచ్చితమైన గణాంకాలను చెప్పడం ఎంతో కష్టం. కానీ, యూరో–మెడిటేరనియన్ హ్యూమన్ రైట్స్ మానిటర్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో 24 వేలకు పైగా చిన్నారులు తమ తల్లిదండ్రుల్లో ఒకరిని లేదా ఇద్దరినీ కోల్పోయినట్లుగా చెప్పుకొచ్చింది.

ఒక నివాస గృహంపై జరిగిన క్షిపణి దాడిలో పదేళ్ల ఇబ్రహీం అబు మౌస్‌కు కాళ్లు, కడుపు భాగంలో తీవ్రమైన గాయాల పాలైయ్యాడు. ఈ దాడిలో ఇబ్రహీం తల్లి, తాత, సోదరి ముగ్గురు ఒకేసారి మరణించారు. దీంతో వారిని తలుచుకుని ఇబ్రహీం గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. "ఆసుపత్రిలోని పై అంతస్థులో వారికి చికిత్స చేస్తున్నామని డాక్టర్లు చెబుతున్నారు. నాన్న ఫోన్‌లో ఫోటోలు చూశాక నాకు అంతా అర్థమైంది. బాగా ఏడ్వడంతో నాకు ఒళ్లంతా బాగా నొప్పిగా మారింది" అని ఇబ్రహీం చెప్పాడు. హుస్సేన్ కుటుంబానికి చెందిన కజిన్స్ అంతా కలిసి మెలసి ఎప్పుడూ ఆడుకుంటుండేవారు. కానీ, ఇప్పుడు అందరి హృదయాలను కలిచివేసేలా ఇబ్రహీం బంధువుల్ని పూడ్చి పెట్టిన సమాధుల వద్ద కూర్చుని కన్నీరు మున్నీరవుతున్నారు. సెంట్రల్ గాజాలో ప్రజలకు ఆశ్రయంగా మారిన పాఠశాల సమీపంలోనే వారిని ఖననం చేయడం మరింత బాధాకరం.

"మా అమ్మ ఒడిలో క్షిపణి పేలడంతో ఆమె శరీరం ముక్కలు ముక్కలైంది. ఇంటి శిథిలాల నుంచి ఆమె శరీర భాగాలను వెలికి తీయడానికి మాకు కొన్ని రోజులు పట్టింది" అంటూ అల్–బురీజ్ శరణార్థి శిబిరంలో ఉన్న అబేద్ హుస్సేన్ రోధించారు. "నా సోదరుడు, మామయ్యతో సహా మా కుటుంబ సభ్యులందరూ క్షిపణి దాడిలో మరణించినట్లు తెలియగానే నా గుండె తరుక్కుపోయింది" అని అబేద్ విలపించారు. ఇజ్రాయెల్ దాడుల శబ్దాలతో రాత్రంతా అబేద్ మేల్కొనే ఉంటున్నారు. "అమ్మ, నాన్న బతికున్నప్పుడు నేను ఎప్పుడూ వాళ్లతోనే ఉండేవాడిని. ఇప్పుడు వాళ్లిద్దరూ చనిపోయారు. ఇప్పుడు నాతో ఇంకెవ్వరూ లేరు. ప్రతీ రోజూ రాత్రిపూట మా నాన్న పక్కన పడుకునేవాడిని. ఇప్పుడు నేనెవరి దగ్గర పడుకోవాలి..? నాన్నలేని ఈ ఒటరితనం నన్ను కృంగదీస్తోంది" అంటూ అబేద్ ఆవేదన వ్యక్తం చేశారు. అబేద్‌తో పాటు ప్రాణాలతో బతికి బయటపడ్డ ఆయన ఇద్దరు తోబుట్టువుల ఆలనా పాలనా.. వారి అమ్మమ్మ చూసుకుంటున్నారు. కానీ ఇప్పుడు రోజులు వారికి చాలా భారంగా గడుస్తున్నాయి. "ఇక్కడ తినడానికి తిండి లేదు, దప్పిక తీర్చుకోవడానికి కనీసం మంచి నీళ్లు లేవు. సముద్రపు నీటిని తాగడం వల్ల కడుపునొప్పిగా ఉంటోంది" అంటూ అబేద్ రొదిస్తున్నారు.

రొట్టెల కోసం పిండిని తీసుకొస్తుండగా క్షిపణి దాడిలో కింజా హుస్సేన్ తండ్రి చనిపోయారు. శవంగా తండ్రిని చూడటంతో ఆమె కళ్ల ముందు నుండి ఆ భయానక దృశ్యం తొలగిపోలేదు. " అచేతన స్థితిలో పడి ఉన్ననాన్నకు కళ్లు లేవు. నాలుక తెగిపోయి ఉంది. ఈ యుద్ధం ఇంతటి బీభత్సాన్ని సృష్టిస్తుందని మేమెప్పుడూ ఊహించలేదు. శత్రువులపై దాడులంటే... ఇలా ప్రజలపై విరుచుకుపడటం ఏంటి..?" అని కింజా హుస్సేన్ ప్రశ్నించారు. గాజాలో ఇప్పుడు దాదాపు అందరూ మానవతా సాయంపైనే ఆధారపడుతున్నారు. ఐరాస గణాంకాల ప్రకారం, 17 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కుటుంబ సభ్యులను కాపాడుకోవడానికి చాలా మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిపోయారు.



గాజా దాడుల్లో దాదాపుగా 19 వేల మంది చిన్నారులు అనాథలయ్యారని, వారి ఆలనాపాలనా చూసుకోవడానికి ఎవరూ లేకపోవడంతో అక్కడి పరిస్థితులు చాలా ఆందోళనకరమైన విషయమని యూనిసెఫ్ ఆవేదన వ్యక్తం చేసింది. "చాలా మంది పిల్లల్ని శిథిలాల కింద గుర్తించాం. ఇళ్లపై బాంబులు పడటంతో తల్లిదండ్రుల్ని వారు కోల్పోయారు" అని యూనిసెఫ్ పాలస్తీనా కమ్యూనికేషన్స్ చీఫ్ జోనాథన్ క్రిక్స్ వెల్లడించారు. "కొంతమంది చిన్నారులు కనీసం వారి పేర్లు కూడా చెప్పలేకపోతున్నారు. వీరి బంధువులను గుర్తించి వారికి అప్పగించడం ఇప్పుడు ఎంతో శ్రమతో కూడుకున్న విషయం" అని జోనాథన్ క్రిక్స్ ఆవేదన వ్యక్తం చేశారు.

(మిగతా 8వ పేజీలో)

వీరందరికీ సంబంధీకులు.. సమీప బంధువులు ఉన్నప్పటికీ, కష్టాల్లో ఉన్న చిన్నారులకు వారు సాయం చేయగలిగే పరిస్థితిలో ఉన్నారో లేరో కూడా తెలిని పరిస్థితి.



" వాళ్లు కూడా కష్టాల్లో ఉన్నారనే విషయం మర్చిపోకూడదు. వారికి కూడా పిల్లలు ఉంటారు. వారి పిల్లల బాగోగులు కూడా చూసుకోవాలి. అది చాలా కష్టం కావచ్చు. అసాధ్యం కాకపోయినా తల్లిదండ్రుల నుంచి విడిపోయిన, తోడు లేని పిల్లల్ని చూసుకోవడం వారికి మరింత ఇబ్బంది" అని క్రిక్స్ వ్యాఖ్యానించారు.

ఎస్ఓఎస్ చిల్డ్రన్ విలేజెస్‌లి అనే స్వచ్ఛంద సంస్థ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి యునిసెఫ్‌తో కలిసి పని చేస్తోంది. 10 ఏళ్ల లోపు ఉన్న 55 మంది చిన్నారులను తమ సంస్థలోకి తీసుకుంటామని ఈ సంస్థ తెలిపింది. పిల్లలకు మానసిక సాయం అందించేందుకు రఫాలో అదనంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసింది. ఓ చెక్ పాయింట్ దగ్గర తాను నాలుగేళ్ల చిన్నారిని గుర్తించానని ఎస్ఓఎస్ సీనియర్ సభ్యురాలు ఒకరు చెప్పారు. ఆ చిన్నారి లిమ్యూటిజంలితో బాధ పడుతోంది. తనకు తన కుటుంబానికి ఏం జరిగిందో చెప్పలేకపోతోంది. అయితే కొద్ది రోజుల తరువాత ఇతర చిన్నారులతో ఆడుకోవడం, కొన్ని బహుమతులు ఇచ్చిన తర్వాత ఆమె పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందన్నారు. గాజాలో చిన్నారులందరికీ మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సహాయం ఇప్పుడెంతో అవసరమని యునిసెఫ్ బలంగా విశ్వసిస్తోంది. బాలల జీవితాలు చెప్పలేనంతగా చెల్లాచెదురయ్యాయి. యుద్ధం ఆగిపోయిన తర్వాత కూడా అనేక మంది చిన్నారులు వాళ్లు ఎదుర్కొన్న భయంకరమైన పరిస్థితులు, సంఘటనలు.. నష్టాల నుంచి బయటపడటం అంత తేలికైన వ్యవహారం ఏమీ కాదు.

## మరణమైనా, నొప్పి అయినా బాధాకరమే: ఇజ్రాయెల్

హమాస్‌ను నిర్మూలించడానికి, ఇజ్రాయెల్ బందీలను స్వదేశానికి తీసుకురావడానికి గాజాపై వైమానిక దాడులను కొనసాగిస్తామని ఇజ్రాయెల్ అంటోంది. "పౌరులు మరణించినా... తీవ్రమైన గాయాలైనా మాకు బాధాకరమే, కానీ, మాకు మరే ఇతర ప్రత్యామ్నాయం లేదు" అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ వ్యాఖ్యానించారు. "గాజా స్ట్రిప్ లోపలికి వీలైనంత ఎక్కువ వెళ్లడానికి మేం చేయగలిగినదంతా చేస్తున్నాం, "ఆర్మీ ఇంకొంచెం కఠినంగా వెళ్లాలి. ఎందుకంటే, ఉగ్రవాదులు లొంగిపోవడాన్ని చూస్తున్నాం, వారి నెట్‌వర్క్ కూలిపోతోందనడానికి సంకేతమది" అని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ హెర్జి హలేవి సైనికులకు చెప్పడాన్ని చిత్రీకరించారు. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వం అత్యవసర చట్టాన్ని ఉపయోగించింది. ఇజ్రాయెల్‌కు రూ. 884 కోట్ల కంటే ఎక్కువ విలువైన 14,000 రౌండ్ల ట్యాంక్ మందుగుండు సామగ్రిని విక్రయించడానికి ఈ చట్టం అధికారం ఇచ్చింది.



## జనం ఆకలితో అలమటిస్తున్నారు: ఐరాస

గాజాలో ఇజ్రాయెల్ దాడులు ఒకవైపు ఉంటే... మరో వైపు అక్కడి జనాభాలో 50 శాతం మంది ఆకలితో అలమటిస్తున్నారని, అక్కడ పోరాటాలు కొనసాగుతున్నాయని ఐక్యరాజ్యసమితి సీనియర్ సహాయ అధికారి ఒకరు స్పష్టం చేశారు. "అవసరమైన సామగ్రిలో కొంతభాగం మాత్రమే గాజా స్ట్రిప్‌లోకి ప్రవేశిస్తోంది, ప్రతీ 10 మందిలో 9 మందికి ఆహారం దొరకడం లేదు" అని యూఎన్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం డిప్యూటీ డైరెక్టర్ కార్ల్ స్కౌ అంటున్నారు. అక్టోబరు 7 నుంచి గాజా అంతటా జనం కదలికలు తగ్గిపోయాయి, హమాస్ మిలిటెంట్స్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి వేలాది మందిని మందిని చంపారు, మరో 240 మందిని బందీలుగా తీసుకెళ్లారు. దీంతో గాజా నుంచి ఇజ్రాయెల్ రాకపోకలను ఆపేసింది. వైమానిక దాడులను ప్రారంభించింది, గాజా ప్రజలు ఎక్కువగా ఆధారపడే సహాయ పంపిణీలను పరిమితం చేసింది. ఏడు వేలకు పైగా పిల్లలతో సహా 17,700 మందికి పైగా గాజా ప్రజలను ఇజ్రాయెల్ హతమార్చిందని హమాస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఇప్పటివరకూ ఈజిప్టు సరిహద్దులో ఉన్న రఫా క్రాసింగ్ మాత్రమే తెరిచారు, దీంతో గాజాకు పరిమితంగానే సహాయం అందుతోంది.

సహాయక ట్రక్కుల తనిఖీ కోసం కొద్ది రోజులు కెరెమ్ షాలోమ్ క్రాసింగ్‌ను తెరవడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. ప్రజల్లో భయం, గందరగోళం, నిరాశ కనిపిస్తోంది. గిడ్డంగుల వద్ద గందరగోళం, ఆకలితో అలమటిస్తూ వేలాదిగా జనం పంపిణీ కేంద్రాల వద్ద ఎదురుచూడటం, ఖాళీ అయిన సూపర్ మార్కెట్లు దర్శనమిస్తున్నాయి. అంతర్జాతీయ ఒత్తిడితో ఏడు రోజుల పాటు కాల్పుల విరమణ చేసింది ఇజ్రాయెల్. ఆ సమయంలో గాజా స్ట్రిప్‌లోని బాధితులకు అవసరమైన సామగ్రి చేరింది. అయితే ఇప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉందని, దాన్ని తీర్చడానికి రెండో సరిహద్దు క్రాసింగ్ తెరవడం అవసరమని వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం అంటోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రతీ పది కుటుంబాలలో తొమ్మిది వరకు పగలు, రాత్రి ఎటువంటి ఆహారం లేకుండానే గడుపుతున్నారని తెలుస్తోంది. గాజాకు దక్షిణాన ఉన్న ఖాన్ యూనిస్ ప్రాంతానికి రెండు వైపులా ఇజ్రాయెల్ ట్యాంకులు చుట్టుముట్టడంతో అక్కడి ప్రజల పరిస్థితి భయంకరంగా ఉంది. గాజాపై ఇజ్రాయెల్స్ దాడులు విజయం సాధించాయో లేదో తేల్చి చెప్పలేం కానీ, అక్కడి ప్రజా జీవితాన్ని మాత్రం చిన్నాభిన్నం చేసిన విషయం మాత్రం వాస్తవమని ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో అంగీకరించాల్సిందే. 28 వేల మందికి పైగా పాలస్తీనీయులు ఈ దాడుల్లో మృతి చెందారు. వీరిలో దాదాపుగా 10 వేల మందికి పైగా అన్యంపుణ్యం తెలియని చిన్నారులు ఉండటం ఎంతో బాధాకరం. 7 వేల మంది మహిళలు శిథిలాల్లో చితికిపోగా, మరో 7 వేల మంది ప్రజల జాడ ఇప్పటికీ అంతు చిక్కడం లేదంటూ... ఇజ్రాయెట్ దాడులు ఎంతటి విధ్వంసాన్ని సృష్టించాయో అర్థం చేసుకోవచ్చు. 29 వేల బాంబులతో విధ్వంసం సృష్టిస్తే.. గాజాలోని 70 శాతం మంది ప్రజల నివాసాలు నేలమట్టమయ్యాయి.



ఈ పరిస్థితులన్నీ గాజాలోని చిన్నారుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయి. బాల్యంపై పడ్డ గాజా దాడుల రక్తపు మరకలు ఎప్పటికి చెరిపోతాయి..? చిన్నారులపై గాజా గాయాలు మానేదెప్పుడు...? ప్రపంచంలోని వివిధ దేశాలు తమ శత్రుదేశాలపై యుద్ధం ప్రకటించే ముందు అక్కడి చిన్నారుల పరిస్థితులపై దృష్టిపెట్టకపోతే... బాల్యంపై పడే గాయాలను ఇక ఎప్పటికీ మాన్పలేం సరికదా... పసి హృదయాలపై తీరని గాయం చేసినట్లే.

**-వి.వి.వెంకటేశ్వరరావు,**
**6300866637.**

# కోరిన కోర్కెలు తీర్చే అంతర్వేది నారసింహుడు

## మాఘశుద్ధ సప్తమి నుండి నవాహ్నికంగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీ నరసింహస్వామి లక్ష్మీ సమేతుడై కొలువు దీరిన తూర్పు గోదావరి జిల్లా అంతర్వేదిలో ప్రతి సంవత్సరం మాఘశుద్ధ సప్తమి నుండి మాఘ బహుళ పాడ్యమి వరకు నవాహ్నికంగా స్వామి వారిక వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా మాఘశుద్ధ దశమి నాడు స్వామి వారికి కల్యాణోత్సవం వైభవంగా జరిపిస్తారు.



తూర్పు గోదావరి జిల్లాలో మూడు పాయలుగా చీలిన గోదావరి నది పాయ వశిష్ఠ గోదావరి అంతర్వేది లో వద్ద బంగాళా ఖాతంలో సంగమి స్తుంది. అంతర్వేది త్రికోణా కారపు (లంక) దీవిలో వుంది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీనర సింహస్వామి పుణ్య తీర్థం భక్తుల కోర్కెలు తీర్చే పుణ్య క్షేత్రం...వశిష్టా నది సముద్రంలో కలిసే ప్రాంతం నుండి మొదలయ్యే అంతర్వేది సముద్రతీరం దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర ఉంటుంది. లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం పరిసర ప్రాంతము లలో, అంతర్వేది గ్రామంలో, సముద్రతీరానికి వెళ్ళు రహదారిలో క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వర స్వామి, విఘ్నే శ్వర స్వామి, అభయాంజనేయ స్వామి, షిర్డీసాయి ఆలయాలు, గ్రామ దేవతల ఆలయాలు ఉన్నాయి..

గోదావరీ నదికి ఒక వేపు ఉన్న "సఖినేటి పల్లి" మండలానికి చెందిన "అంతర్వేది" తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. అటు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం కు సమీపంలో వుంది. గోదావరి దాటి అంతర్వేది చేరుకోవచ్చు. సముద్ర తీరాన ఉన్న ఈ ఆలయం ఎంతో విశిష్టతను సంతరించు కుంది. ఇది దక్షిణ కాశిగా పేరు పొందింది. సూతమహాముని అంతర్వేదిని గురించి శౌనకాది మహర్షులకు చెప్పినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఒకసారి బ్రహ్మ రుద్ర యాగం చేయాలని సంకల్పించి యాగానికి వేదికగా ఈ ప్రదేశాన్ని ఎన్నుకుని శివలింగాన్ని ప్రతిష్ఠిం చాడు. అందుకే ఈ ప్రదేశానికి అంతర్వేది అనే పేరు వచ్చింది అని చెబుతారు. వశిష్టమహర్షి ఇక్కడ యాగం చేసిన కారణంగా ఇది అంతర్వేదిగా ప్రసిద్ధి చెందింది. హిరణ్యాక్షుని కుమారుడైన రక్తావలోచనుడు అనే రాక్షసుడు ఈ వశిష్ట గోదావరి ఒడ్డున అనేక సంవత్సరాలు తపస్సు చేసి శివుని అనుగ్రహంతో వరం పొందుతాడు.

ఆ వరం ప్రకారం రక్తావలోచనుని శరీరం నుండి కింద పడిన రక్తపు బిందువుల నుండి మరికొంతమంది అతి బలవంతులైన రక్తావలోచ నులు ఉద్భ విస్తారు. ఆవరగర్వంతో యజ్ఞయాగాలు చేసే వారిని, గోవుల ను హింసించేవాడు. ఒక సారి విశ్వామిత్రుడికి, వశిష్ఠుడికి జరిగిన సమరంలో రక్తావలో చనుడు విశ్వామిత్రుని ఆజ్ఞపై వచ్చి భీభత్సం సృష్టించి, వశిష్ఠుడి నూరు గురు పుత్రులను సంహరించాడు. వశిష్ఠ మహర్షి శ్రీమహావిష్ణువుని ప్రార్థించగా విష్ణుమూర్తి లక్ష్మీ సమేతుడై నరహరి అవతారంతో రక్తావలోచనుడుని సంహరించ డానికి వస్తాడు. నరహరి ప్రయో గించిన సుదర్శన చక్రంతో రక్తావ లోచనుడి శరీరం నుండి రక్తం పడిన ఇసుక రేణువుల నుండి వేలాది మంది రాక్షసులు జన్మిస్తారు. నరసింహుడు ఈ విషయం గ్రహించి తన మాయాశక్తిని ఉపయోగించి రక్తావలోచనుని శరీరం నుండి పారిన రక్తం నేలపై పడకుండా చేస్తాడు. అది రక్తకుల్య అనే నదిలోకి ప్రవహించేటట్లు చేసి రక్తావ లోచనుడిపై సుదర్శన చక్రాన్ని ప్రయోగించి సంహరిస్తాడు. ఈ రాక్షస సంహారం తర్వాత వశిష్ఠుని కోరికపై నరహరి ఇక్కడ లక్ష్మీనృసింహస్వామిగా వెలిశాడని ప్రతీతి.



త్రేతాయుగంలో శ్రీరాముడు సీతా సమేతుడే లక్ష్మణ, హనుమంతు లతో కూడి వశిష్టాశ్రమాన్ని, లక్ష్మీ నరసింహమూర్తిని దర్శించి, సేవించి నట్లు ఇక్కడే కొన్ని రోజులు నివసిం చినట్లు శిలా శాసనాలవల్ల తెలు స్తోంది. ద్వాపర యుగంలో అర్జును డు తీర్థయాత్రలు చేస్తూ 'అంతర్వే ది' దర్శించినట్లు చేమకూర వెంకటకవి తన 'విజయయ విలాసము'లో, శ్రీనాథ కవిసార్వ భౌముడు 'హరి విలాసం'లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఈ ఆలయం 300 ఏళ్ళకు పూర్వం నిర్మించినట్లు తెలుస్తోంది. పల్లవుల చే నిర్మితమైన తొలి ఆలయం శిథిలమైపోగా మళ్ళీ ఈ ఆలయా న్ని నిర్మించారని తెలుస్తోంది. ఈ ఆలయం మొగల్తూరు రాజ వంశీకుల ఆధీనంలో ఉండేది. నేడు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధ్వర్యంలో నడుస్తోంది.

మాఘ శుద్ధ దశమి నాడు లక్ష్మీ సమేతుడైన నృసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవం జరిగిన తర్వాత రోజైన ఏకాదశి నాడు లక్ష్మీ సమేత నృసింహస్వామి నవ వధూవరులై అంగరంగ వైభవంగా రథయాత్ర చేస్తారు. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని శరాఘా తానికి కుప్పకూలిన భీష్మ పితామ హుడు ఉత్తరాయణ పుణ్యకాలం కోసం అంపశయ్య మీద ఎదురు చూశాడు. (రథ) సప్తమి, (భీష్మ) అష్టమి, (మధ్వ ) నవమి, (బ్రహ్మ త్మక) దశమి, (భీష్మ) ఏకాదశి రోజుల్లో రోజుకొక్కటి చొప్పున పంచప్రాణాలు వదిలాడని పురాణగాథ. అందుకే ఈ ఏకాదశిని భీష్మ ఏకాదశి అని, అంతర్వేది తీర్థ ఏకాదశి అని అంటారు. ఈ ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుండి భక్తులు తరలి వస్తారు. ఆలయానికి దూరంగా వశిష్టానదికి దగ్గరగా విశాలమైన స్థలంలో కళ్యాణ మండపం నిర్మించారు. వేలమంది స్వామివారి కళ్యాణం తిలకించే ఏర్పాటు చేసారు. కళ్యాణం అనంతరం ఏకాదశి రోజున రథోత్సవం నిర్వహిస్తారు.

---

# మీ కిచెన్ జిడ్డుగా ఉందా?

గృహిణులు ఎక్కువ సమయం వంటగదిలోనే గడుపుతారు. రుచికరమైన ఆహారాన్ని తయారు చేసి ఇంటి సభ్యులను సంతోషపెట్టడం ఎంత ముఖ్యమో వంటగది శుభ్రత కూడా అంతే ముఖ్యం. కిచెన్ సింక్ శుభ్రంగా ఉంచకపోతే దుర్వాసన వస్తుంది. అంతేకాకుండా రంగు కూడా మారిపోతుంది. కొన్ని వస్తువులను ఉపయోగించి సింక్‌ను సులభంగా శుభ్రం చేయవచ్చు. గిన్నెలు కడుక్కోవాలనే తొందరలో అవాంఛిత ఆహారం సింక్‌లో చేరి బ్లాక్ అవుతుంది. సరిగ్గా శుభ్రం చేయకపోతే సింక్ చాలా మురికిగా మారుతుంది. కాబట్టి ఈ వస్తువులలో కొన్నింటిని ఇంట్లో ఉంచుకోవడం వల్ల సింక్ శుభ్రతను కాపాడుకోవచ్చు.



వేడి నీటిని వాడండి: సింక్ నల్లగా ఉంటే వేడి నీటితో కడగడం వల్ల జిడ్డు పోతుంది. అంతేకాకుండా పైపులో ఉన్న చెత్త కూడా తొలగిపోతుంది. కాకపోతే స్టీల్‌తో చేసిన సింక్ అయితే మాత్రమే వేడినీళ్లు వాడాలని నిపుణులు అంటున్నారు.

బ్లాక్‌ని ఇలా తొలగించండి: సింక్ బ్లాక్ అయితే డ్రెయిన్ స్నేక్ కేబుల్‌ను సింక్ పైపు లోపల ఉంచి బ్లాక్ అయిన చెత్తను తొలగించవచ్చు. నీళ్లు పోసుకుంటూ ఇలా చేయడం వల్ల సులభంగా చెత్త వెళ్తుంది.

నిమ్మతో సింక్‌ని శుభ్రం చేయండి: అందరి వంటగదిలో ఎప్పుడూ అందుబాటులో ఉండే నిమ్మకాయను ఉపయోగించి సింక్‌ను సులభంగా శుభ్రం చేయవచ్చు. కోసిన నిమ్మకాయలో ఉప్పు కలిపి రుద్దితే సింక్ మురికి పోయి మెరుస్తుంది.

వెనిగర్, బేకింగ్ సోడా: సింక్ బ్లాక్ అయినట్లయితే వెనిగర్, బేకింగ్ సోడాను సింక్ శుభ్రం చేయడానికి ఉపయోగించవచ్చు. బేకింగ్ సోడా, వెనిగర్ వేసి కాసేపు అలాగే ఉంచి ఆ తర్వాత సింక్‌లో వేడి నీళ్లతో కడిగేయాలి.

బేకింగ్ సోడా: బేకింగ్ సోడాను నీళ్లలో మిక్స్ చేసి సింక్‌లో వేసి కాసేపు అలాగే ఉంచి నీళ్లతో కడిగి కాటన్ క్లాత్‌తో తుడిస్తే సింక్ మెరుస్తుంది.

ఆలివ్ ఆయిల్: సింక్ మురికిగా, రంగు మారితే కాస్త ఆలివ్ ఆయిల్‌ను ఒక గుడ్డపై వేసి సింక్ తుడిస్తే జిడ్డు పోతుంది. స్టీల్ సింక్ అయితే ప్రకాశవంతంగా మెరుస్తుంది.

# సినిమా రివ్యూ




సరైన, భారీ విజయం కోసం కొన్నేళ్లుగా శ్రమిస్తున్న యువ హీరో సందీప్ కిషన్. ఈ ఏడాది వచ్చిన ధనుష్ 'కెప్టెన్ మిల్లర్'లో ఓ క్యారెక్టర్ చేస్తే... తెలుగులో ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. గతేడాది ఎన్నో అంచనాలు పెట్టుకుని చేసిన పాన్ ఇండియా ఫిల్మ్ 'మైఖేల్' ఫ్లాప్ అని స్వయంగా సందీప్ కిషన్ చెప్పారు. ఆయన ఖాతాలో సాలిడ్ సక్సెస్ పడి చాలా రోజులైంది. ఈ శుక్రవారం 'ఊరు పేరు భైరవకోన'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. వీఐ ఆనంద్ దర్శకత్వం, అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన చిత్రమిది. విడుదలకు రెండు రోజుల ముందు పెయిడ్ ప్రీమియర్లు వేశారు. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని టీమ్ సంతోషం వ్యక్తం చేసింది. మరి, సినిమా ఎలా ఉంది? రివ్యూలో చూడండి.

**కథ:** భైరవకోనలోకి వెళ్లడం తప్ప... ఆ ఊరు నుంచి ప్రాణాలతో బయటకు వచ్చిన జనాలు లేరు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బసవ (సందీప్ కిషన్), జాన్ (వైవా హర్ష), అగ్రహారం గీత (కావ్య థాపర్) ఆ ఊరిలోకి వెళతారు. నిజానికి, బసవ స్టంట్ మ్యాన్. అనుకో కుండా పరిచయమైన భూమి (వర్ష బొల్లమ్మ)ని చూసి ప్రేమలో పడ తాడు. ఆమె కోసం, ఆమె గూడెం ప్రజల కోసం ఒక పెళ్లిలో అమ్మాయి నగలు దొంగతనం చేస్తాడు.భైరవకోన వెళ్లిన బసవకు ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అక్కడ పెద్దమ్మ (వడివుక్కరసి), రాజప్ప (రవి శంకర్), డాక్టర్ నారప్ప (వెన్నెల కిశోర్) ఏం చేశారు? భైరవకోన చరిత్ర ఏమిటి? ఆ కోనకు, గరుడ పురాణంలో మాయమైన నాలుగు పేజీలకు సంబంధం ఏమిటి? భైరవకోన నుంచి బసవ అండ్ గ్యాంగ్ ప్రాణాలతో బయటపడ్డారా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ:** దర్శకుడు వీఐ ఆనంద్ సూపర్ నాచురల్ అంశాలతో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' వంటి హారర్ సినిమాలు తీసి విజయాలు అందుకున్నారు. అందుకని ప్రచార చిత్రాలు విడుదలైన తర్వాత 'ఊరు పేరు భైరవకోన' సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. శేఖర్ చంద్ర సంగీతం అందించిన పాటలకు మిలియన్స్ వ్యూస్ రావడం కూడా ప్లస్ అయ్యింది. మరి, సినిమా ఎలా ఉంది? అనేది చూస్తే...'ఊరు పేరు భైరవకోన'కు బలం, బలహీనత వీఐ ఆనంద్లో దర్శకుడు. ఆయన నుంచి ప్రేక్షకులు ఆశించే సూపర్ నాచురల్ / హారర్ / థ్రిల్లర్ / కామెడీ మూమెంట్స్ సినిమాలో ఉన్నాయి. ఇంటర్వెల్ వరకు వీఐ ఆనంద్ మ్యాజిక్ కొంత వరకు వర్కవుట్ అయ్యింది. ఆ తర్వాత కథలో బలం తగ్గింది. వీఐ ఆనంద్ మ్యాజిక్ మిస్ అయ్యింది. అడ్వెంచరస్ థ్రిల్లర్ సినిమా కాస్త రొటీన్ లవ్ స్టోరీ అయిపోయింది.భాను భోగవరపు రాసిన కథ, ఆ కథతో దర్శకుడు వీఐ ఆనంద్ క్రియేట్ చేసిన భైరవకోన ప్రపంచం ఆశ్చర్యపరుస్తుంది. సినిమా ప్రారంభమే ఊరు చూపించి భైరవకోనపై ఆసక్తి కలిగించారు. తర్వాత హీరో హీరోయిన్ల పరిచయం సాదాసీదాగా ఉన్నప్పటికీ... పాటలు, కామెడీ సీన్లతో సినిమా పాసైపోయింది. భైరవకోనలో ఎంటరైన తర్వాత వెన్నెల కిశోర్, వైవా హర్ష కామెడీ నవ్విస్తుంది. మిగతా పాత్రల ప్రవర్తన క్యూరియాసిటీ కలిగిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ బావుంటుంది. ఆ తర్వాత అసలు సిసలు కథలోకి వెళ్లిన తర్వాత ఆసక్తి నెమ్మదిగా సన్నగిల్లుతుంది.

'ఊరు పేరు భైరవకోన'లో పాత్రలను పరిచయం చేసేటప్పుడు కలిగే ఆసక్తి కథలోకి వెళ్లిన తర్వాత ఉండదు. అమ్మాయి కోసం ప్రాణాలకు తెగించి మరీ హీరో రిస్క్ చేస్తున్నాడంటే... ప్రేమ ఎంత బలమైనదో అనుకుంటాం! ఆ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ చూస్తే అంత డెప్త్ ఉండదు. అక్కడ ఎమోషన్ వర్కవుట్ కాలేదు. ఇక దెయ్యాలను బకరా చేయాలనుకునే సన్నివేశాలు శ్రీను వైట్ల సినిమాలను గుర్తు చేశాయి. ఇంటర్వెల్ బ్యాంగ్ కూడా కొత్తగా లేదు. టెక్నికల్ టీమ్ నుంచి వీఐ ఆనంద్ మంచి అవుట్‌పుట్ రాబట్టుకున్నారు. శేఖర్ చంద్ర పాటలు సినిమా విడుదలకు ముందు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. నేపథ్య సంగీతం కూడా బావుంది. సినిమాటోగ్రఫీ, విజువల్స్ ఎఫెక్ట్స్ బావున్నాయి. నిర్మాణ విలువలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి.బసవ పాత్రకు సందీప్ కిషన్ న్యాయం చేశారు. 'వెన్నెల' కిశోర్, వైవా హర్ష కాంబోలో సీన్లు, వాళ్లిద్దరి టైమింగ్ సూపర్బ్. బ్రహ్మాజీ సైతం నవ్వించారు. భూమి పాత్రలో వర్ష బొల్లమ్మ ఓకే. కానీ, ఆమెకు రాసిన సీన్లలో బలం లేదు. కావ్య థాపర్ హీరోయిన్ అని చెప్పలేం. ఉన్నంతలో అందంగా కనిపించారు. కథలో కీలక పాత్ర చేశారు. రవి శంకర్, వడివక్కరసి, జయప్రకాశ్ తదితరులు పాత్రల పరిధి మేరకు చేశారు. 'ఊరు పేరు భైరవకోన' స్టోరీ ఐడియా బావుంది. అయితే ఆ కథలో కీలకమైన హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ, వాళ్లిద్దరి బంధంలో బలం లేదు. కథనంలో పట్టు లేదు. విశ్రాంతికి ముందు జరిగిన సన్నివేశాలతో భైరవకోన ప్రపంచంలో తర్వాత ఏం జరుగుతుందో? అనే ఉత్కంఠ ఉంటుంది. విశ్రాంతి తర్వాత అంతకు అంత నిరాశ కలిగిస్తుంది. రెండు గంటలు థియేటర్లలో కూర్చోవడం, ఈ సినిమాతో సందీప్ కిషన్ విజయం అందుకోవడం కష్టం.

---




ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోయే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. అలాంటి అరుదైన సినిమా అనే అభిప్రాయాన్ని ట్రైలర్ తోనే కలిగించింది రాజధాని ఫైల్స్. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన వేలాది రైతుల ఆవేదనని కళ్ళకి కట్టినట్టు చూపిస్తూ తెరకెక్కిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉంది అనేది సమీక్షలోకి వెళ్ళి తెలుసుకుందాం.

**కథ:** అరుణప్రదేశ్ రాష్ట్రంలోని అయిరావతి ప్రాంతం ఏడాదికి రెండు మూడు పంటలు పండే అద్భుతమైన వ్యవసాయ భూమిని కలిగి ఉంటుంది. అయితే ఆ ప్రాంతం రాష్ట్రానికి నడిబొడ్డున ఉండటం, అన్నింటికీ అనువైన ప్రాంతం కావడంతో.. ప్రభుత్వం అయిరావతిని రాష్ట్ర రాజధానిగా ఎంపిక చేస్తుంది. తరతరాలుగా ఆ భూమినే నమ్ముకొని బ్రతుకుతున్న రైతులకు.. తమ భూములు ఇవ్వడం ఇష్టంలేనప్పటికీ.. రాష్ట్రం కోసం, భావి తరాల భవిష్యత్ కోసం.. త్యాగానికి సిద్ధపడతారు. విశ్వనగరం లాంటి రాజధాని నిర్మాణం జరిగితే.. ఎన్నో కంపెనీలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, యువత భవిష్యత్ బాగుంటుందని ఎంతో సంతోషంగా భూములు త్యాగం చేస్తారు రైతులు. రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండటంతో, తాము కలలు కన్న రాజధానిని త్వరలోనే చూసుకోబోతున్నామని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తుండగా.. కొత్త ప్రభుత్వం వచ్చి వారి ఆశలపై నీళ్లు చల్లుతుంది. వారి త్యాగాన్ని వృధా చేస్తుంది. అయిరావతి రాజధానిగా ఉంటే గత ముఖ్యమంత్రి పేరే చరిత్రలో నిలిచిపోతుంది, నీకు ఎలాంటి పేరు రాదని తన పొలిటికల్ అనలిస్ట్ చెప్పిన మాటలతో.. నూతన ముఖ్యమంత్రి నాలుగు రాజధానుల రాగాన్ని ఎత్తుకుంటాడు. దీంతో అయిరావతి రైతులు అహింస మార్గంలో ఉద్యమానికి దిగుతారు. ఆ ఉద్యమాన్ని అణచడానికి సీఎం, అతని అనుచరగణం చేయని దుర్మార్గం ఉండదు. ఆ దుర్మార్గాలను తట్టుకొని రైతులు ఎలా పోరాడారు? ఆ పోరాట ఫలితంగా అయిరావతే రాజధానిగా ఉందా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ:** యదార్థ సంఘటనల ఆధారంగా రాసుకున్న ఈ కథను దర్శకుడు భాను ఎంతో సహజంగా తెరకెక్కించాడు. సినిమాని ఆయన ఎత్తుకున్న విధానం, కథలోకి తీసుకెళ్లిన విధానం చాలా బాగుంది. ఈ సినిమాలో వినోద్ కుమార్, వాణి విశ్వనాథ్ రైతు కుటుంబానికి చెందిన భార్యాభర్తలుగా కనిపించారు. ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచించే ఆ దంపతులంటే.. చుట్టుపక్కల ఎన్నో గ్రామాల ప్రజలకు ఎంతో గౌరవం. కానీ వాళ్ళ కుమారుడిగా కనిపించిన అఖిలన్ తీరు మాత్రం తన తల్లిదండ్రులకి పూర్తి భిన్నం. చిన్నప్పటి నుంచి అతనికి జనమన్నా, జనంతో కలిసి ఉండటమన్నా చిరాకు. అలాంటి వ్యక్తి.. కొత్త ముఖ్యమంత్రి కారణంగా తన వాళ్ళు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని.. తన తల్లిదండ్రులు, ఇతర రైతులతో కలిసి ఉద్యమంలో పాల్గొంటాడు. ప్రజలంటే ఇష్టపడని ఓ యువకుడు.. ఆ ప్రజల కోసమే పోరాడినట్లు చూపించాలన్న దర్శకుడి ఆలోచన కట్టిపడేసింది.

సాధారణంగా వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందే ఇలాంటి సినిమాలు డాక్యుమెంటరీ లాగానో, ఆర్ట్ ఫిల్మ్ లాగానో అనిపిస్తాయి. కానీ రాజధాని ఫైల్స్ విషయంలో ఒక్క శాతం కూడా అలా అనిపించదు. రైతుల ఆవేదనని కళ్ళకి కట్టినట్టు చూపిస్తూనే, కమర్షియల్ అంశాలను కూడా జోడించి సినిమాని ఎక్కడా బోర్ కొట్టకుండా మలిచారు. హీరో మరియు అతని తల్లిదండ్రుల మనస్తత్వాలను పరిచయం చేస్తూ సినిమా ప్రారంభమవుతుంది. ఆ తర్వాత 'ఏరువాక సాగారో' అంటూ విషాదం పలకరించడానికి ముందు, రైతుల సంతోషాన్ని పరిచయం చేశాడు దర్శకుడు. రాజధాని కోసం రైతులు భూములు త్యాగం చేయడం, కొత్త ముఖ్యమంత్రి కారణంగా ఆ త్యాగం వృధా కావడం, రాజధాని కోసం రైతులు పోరాటానికి దిగడం.. ఇలా ప్రతి సన్నివేశం మన కళ్ళముందే జరుగుతున్నంత సహజంగా ఉంటూ.. మనల్ని పూర్తిగా సినిమాలో లీనమయ్యేలా చేశాయి.

బలమైన భావోద్వేగాలతో గుండెలను పిండేసే సన్నివేశాలు ఈ సినిమాలో ఎన్నో ఉన్నాయి. రాజధాని కోసం పోరాడుతున్న రైతులు ఎన్నో అవమానాలు పడటం, పోలీసుల చేతిలో దెబ్బలు తినడం, ఎందరో ప్రాణాలను కోల్పోవడం, ఆడవారు ప్రాణమానాలను పణంగా పెట్టి పోరాడటం వంటి సన్నివేశాలన్నీ కంటతడి పెట్టిస్తాయి. అరటి తోటలో ఆడవారిని అర్ధనగ్నంగా పరుగెత్తించే సన్నివేశం చూస్తే.. ఆ సినిమాలోని హీరోకే కాదు, సినిమా చూస్తున్న ప్రేక్షకులకు కూడా రక్తం మరిగిపోతుంది అనడంలో సందేహం లేదు. అంత బలంగా సన్నివేశాలను మలిచారు.

ఈ సినిమాలో రైతులను ఆవేదనను, వారి సమస్యని చూపించడమే కాదు.. ఆ సమస్యకి పరిష్కారం కూడా చూపించారు. పతాక సన్నివేశాలు ఊహించనివిధంగా ఉన్నాయి. ఈమధ్య కాలంలో ఇలాంటి క్లైమాక్స్ రాలేదనే చెప్పాలి. ఈ క్లైమాక్స్ నిజ జీవితంలో జరిగితే మాత్రం దేశరాజకీయాలు ఒక్కసారిగా మారిపోయే అవకాశముంది.

సమిష్టి కృషి అనే దానికి నిర్వచనంలా ఈ సినిమా ఉంది. అన్ని విభాగాల పనితీరు అద్భుతంగా ఉంది. దర్శకుడు భాను కథాకథనాలతో పాటు తనదైన మేకింగ్ తో మెప్పించాడు. మణిశర్మని లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎందుకంటారో మరోసారి రుజువైంది. పాటలతో ఎప్పటిలాగే మ్యాజిక్ చేశారు. ఏరువాక సాంగ్ తో పాటు, థీమ్ సాంగ్స్ తో మెస్మరైజ్ చేశారు. ఇక నేపథ్య సంగీతంతో అయితే సినిమాని మరోస్థాయికి తీసుకెళ్లారు. ఈ కథలో ఎంత నిజాయితీ ఉందో.. రమేష్ కెమెరా పనితనం అంత సహజంగా ఉంది. దర్శకుడి ఆలోచనకు తగ్గట్టుగా రైతుల ఆవేదనను కెమెరాలో చక్కగా బంధించారు. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు తన అనుభవంతో సినిమాని నీట్ గా ప్రజెంట్ చేశారు. అనిల్ అచ్చుగట్ల సంభాషణలు ఆకట్టుకున్నాయి. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

**నటీనటుల పనితీరు:** ఈ సినిమాలో ప్రతి ఒక్క యాక్టర్ ప్రాణం పెట్టి నటించారు. రైతు నాయకుడిగా వినోద్ కుమార్ నటన కట్టిపడేసింది. ఇప్పటిదాకా ఆయన పోషించిన ఉత్తమ పాత్రలలో ఒకటిగా ఇది నిలిచిపోతుంది. రైతు నాయకురాలిగా వాణి విశ్వనాథ్ కూడా మెప్పించారు. ఎమోషనల్ సన్నివేశాల్లో ఆమె నటనకు ఎవరైనా కంటతడి పెట్టాల్సిందే. ఇక రైతుల కోసం పోరాడే యువకుడి పాత్రలో అఖిలన్ నటన గుర్తుండిపోతుంది. ఎంతో అనుభవం ఉన్న నటుడిలా పాత్రలో చక్కగా ఒదిగిపోయాడు. వీణ, పవన్, విశాల్, షణ్ముఖ్, మధు, అజయ్ రత్నం, అంకిత ఠాకూర్ తదితరులు వారి పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. 'ఏరువాక' పాటలో అమృత చౌదరి నృత్యం ఆకట్టుకుంది.

**ఫైనల్ గా..** వినోదాన్ని పంచే సినిమాలు రెగ్యులర్ గా వస్తాయి. కానీ వాస్తవాన్ని చూపిస్తూ ఆలోచన రేకెత్తించే సినిమాలు అరుదుగా వస్తాయి. అలాంటి అరుదైన సినిమానే 'రాజధాని ఫైల్స్'. ఇది ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో చెందిన సినిమా కాదు. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా.. అందరినీ కదిలించే రైతుల త్యాగానికి, వారి ఆవేదనకి సాక్ష్యం ఈ చిత్రం.

**రేటింగ్:** రైతుకి, భూమికి ఉన్న బంధానికి.. రైతు కన్నీళ్ళకి విలువ కట్టగలమా?. రైతుల కన్నీళ్ళకి ఎలాగైతే విలువ కట్టాలేమో.. రైతుల కన్నీటి గాధను కళ్ళకు కట్టినట్టు చూపించిన ఈ సినిమాని కూడా రేటింగ్ పేరుతో తక్కువ చేయలేము.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 18.2.2024 నుంచి 25.2.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో రావలసిన ధనము సమయానికి అందడంలో కొంత ఆలస్యం ఆటంకం నిరాశను కలిగిస్తుంది కోపాన్ని నియంత్రించుకోవాలి. ఎదుటివారితో మాటల వల్ల అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. వృత్తిపరంగా ఉన్నతాధికారులతో వాగ్వాదాలకు లోను కాకుండా సమయ–స్ఫూర్తిగా వ్యవహరించాలి. వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వారం మధ్యలో సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. విదేశీ ఆదాయాన్ని, బాగస్వామి తరపున విదేశాలలో ఉన్న ఆత్మీయుల సహాయాన్ని సమయానికి పొందగలుగుతారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలోనూతన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. తల్లితండ్రుల సహకారం లభిస్తుంది, నూతన పెట్టుబడుల కొరకు గృహ వాహన మార్పుల కొరకు ఆలోచనలు చేస్తారు. మనసుకు కొంత ఆహ్లాదకరంగా ఉంటుంది, విందు వినదాల్లో పాల్గొంటారు ఇచ్చిన రుణములు తిరిగి రావడం కొంత కష్టం. బాగస్వామికి వృత్తిపరమైన విషయాలలో అధిక శ్రమ నూతన బాధ్యతలు. అధికారుల సహకారంలో ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల కొంత నిరాశ ఎదురవుతుంది. సంతానము ఎక్కువ శ్రమతో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. కళాశాల లలో ప్రవేశం కొరకు చేయి ప్రయత్నాలు నెరవేరుతాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన విషయాలు వ్యాపారల వాదేవిలు కుటుంబ,గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. రావలసిన లాభాలు ఆదాయం అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. వృత్తిలో అధికారంలో ఉండే వ్యక్తుల సహకారం కొంత నిరాశ కల్పించినప్పటికీ వారం మధ్యలో అనుకూలతే సిద్ధిస్తుంది. సంఘంలో గౌరవము మర్యాద కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సంతానమునకు అభివృద్ధి విదేశీ అవకాశాలు విద్యలో ముందు ఉండడం మీకు కొంత ఆనందాన్నిస్తుంది. వారం మధ్య కళాకారులకు అనుకూలమైన సమయం. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి గవర్నమెంట్ సంబంధిత టాక్సును చెల్లిస్తారు,



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో చిన్న నాటి మిత్రులను కలుస్తారు. విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది. విద్యార్థులు చాలా శ్రమ పడతారు. జ్ఞాపకశక్తి పెంచుకోవాలి. భాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో , సాంఘిక పరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. స్త్రీలకు ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. సంతానమునకు వృత్తి పరమైన అవకాశాలు, ఉన్నత అధికారుల సహాయ సహకారాలు కొంత ప్రయత్నం మీద కష్టంగా అందుతాయి. భూ సంబంధిత వారసత్వ అంశాలలో సోదర వర్గంతో సమావేశాలు, వారం మధ్యలో గవర్నమెంట్ సంబంధిత విషయాలలో రావలసిన లాభాలు కొంత ఆలస్యం ఆటంకం. వృత్తిపరంగా అధికారంలో ఉండే స్త్రీల సహకారాలు పొందుతారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో మిత్రులతో తోబుట్టువులు సహకారంతో కష్టం మీద పనులు నెరవేర్చుకుంటారు. విద్యార్థులు అధిక శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. వృత్తి పరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. అలంకరణ వస్తువులు కొంటారు.. వారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది వారం మధ్యలో భాగస్వామితో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. దూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది. విదేశీ ఉపాధి ప్రయత్నాలు చేస్తారు. వారము చివరిలో ఆత్మీయులైన వ్యక్తుల కొరకు ఖర్చు అధికము.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో భాగస్వామితో , సంతానముతో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి. ఉపాసనా పరమైనఅంశాలలో అవరోధాలు ఎదుర్కొంటారు. ప్రయాణాలు కొంత చికాకును కలిగిస్తాయి. విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి. ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. వారం మధ్యలో కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయుల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు. వారం చివరిలో వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు, నూతన వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు. భాగస్వామికి ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. సంతానం కొరకు, బహుమాన రూపంలో ఖర్చులు అధికంగా చేస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో సంబంధము లేని విమర్శలు మనసుని ఇబ్బంది పెడతాయి. సంఘంలో గౌరవం, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు, ఆరోగ్య విషయాలు తీసుకోవాలి ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి ప్రతి విషయంలోన ఆలస్యాలు ఆటంకాలుచికాకును కలిగిస్తాయి. సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్నప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపార్థాలకు అవకాశము. స్త్రీల తో ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. స్థిరాస్తుల అంశాలలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో మెలకువగా వ్యవహరించాలి. పరిచయస్తులు మోసం చేసేందుకు అవకాశం ఉంది. వారము చివరిలో సంతానానికి సంబంధించిన విద్యా విషయాలలో ఎక్కువ శ్రద్ధ.మానసిక ప్రశాంతత తగ్గుతుంది.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వార ప్రారంభంలో సంఘంలో పలుకుబడి పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు. విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు. చాలా ఉత్సాహంగా ఉంటారు భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి రుణములు చెల్లిస్తారు కొత్తరుణం కొర కు ప్రయత్నం చేస్తారు. సేవకులు సహకరిస్తారు. కుటుంబంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. వారం మధ్యలో ఆరోగ్యమే శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది ఆకస్మిక అనవసరమైన ప్రయాణాలు ,ముఖ్యమైన విషయాలు వాయిదా.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో సంతానము అభివృద్ధికరంగా ఉంటుంది. గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నాలకు మీ ఆత్మీయుల సహకారం తోడ్పాటు అందిస్తారు. రావలసిన రుణములు అందుకుంటారు. విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సిద్ధం అవుతారు. వారం మధ్యలో ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఆహ్వానాలని అందుకుంటారు. వారం చివరిలో రీసర్చ్ చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. చేయి ప్రయత్నాలు సంతృప్తికరంగా ముందుకు సాగుతాయి. భాగస్వామి మరియు తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలి. మంచి ఫలితముల కొరకు శ్రీకృష్ణ మందిరాలు దర్శించడం లేదు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. సమయానికి ఆహార స్వీకరణ మంచిది తగిన విశ్రాంతి అవసరము. జ్ఞాపక శక్తిని మెరుగుపరుచుకునే విషయాల్లో శ్రద్ధ వహించాలి ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. వృత్తి పరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపుని గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వాతావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్దల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు. వారం మధ్యలో రావలసిన బాకీ వసూలు .



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోస్థిరాస్తులు అంశములలో సోదరీ వర్గంతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేస్తే సిబ్బంది సహాయం, ఆకస్మికమైనవిషయాలలోకొంతలాభం,శుభకార్యాలకు ఆహ్వానా లు. గృహల్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వాహనములకు సంబంధించిన చిన్నబాటి రిపేర్లు. వారం మధ్యలో మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో సోషల్ మీడియాలో పెట్టుబడి పెడతారు. స్త్రీల సహకారాన్ని పొందుతారు. భాగస్వామికి గుర్తింపు గౌరవం లభిస్తుంది. విదేశాలలో ఉండే వ్యక్తుల సహకారం లభిస్తుంది. వారి వ్యాపార పరంగా అభివృద్ధి. వృత్తిపరంగా నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు చేస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభం కమ్యూనికేషన్ బాగుంటుంది ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు. మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి. సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువులు సహకరిస్తారు కళాకారులకు గుర్తింపు. వారం మధ్యలో విద్యార్థులు విద్య మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి అనవసర విషయాలకు దూరంగా ఉండాలి. కుటుంబ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన, భూసంబంధ అంశములలో ఉన్నత అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. వాదనలకు దూరంగా ఉండాలి. పోటీ తత్వం ధైర్యసాహసాలు పెరుగుతాయి.


వర్ష బొల్లమ్మ